బుధవారం
15-06-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 70, సంచిక : 352
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నేటినుంచి చంద్రబాబు ప్రచారయాత్ర

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలకు శ్రీకారం చుట్టారు. బుధవారం నుంచి ఎన్టీఆర్ స్ఫూర్తి - చంద్రన్న భరోసా పేరుతో ఏడాది పాటు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించాలని చంద్రబాబు నిర్ణయించారు. ఒక్కో టూర్‌లో చంద్రబాబు మూడు రోజులు జిల్లాలలో పర్యటించనున్నారు.

8 లో

అశ్రునివాళి

ప్రేమ, అనురాగం, ఆత్మీయత, మానవత్వం
మూర్తీభవించిన మానవతామూర్తి... మంచికి మారుపేరు....
నీతి, నిజాయితీలకు నిలువెత్తు నిదర్శనం.. ఉత్తమ విలువలతో జీవించి
ఎందరికో ఆదర్శంగా నిలిచిన మార్గదర్శి..
అనునిత్యం మా ఉన్నతి కోసం శ్రమించి,
మమ్మల్ని సమాజంలో గౌరవ స్థానంలో నిలిపిన
శ్రీ మెర్ల చంద్రశేఖరరావు గారు భౌతికంగా
మాకు దూరమైనా మీతో గడిపిన ప్రతిక్షణం
ఎప్పటికీ మాకు చిరస్మరణీయమే.
మీరు పంచిన ప్రేమ, నడిచిన నడత, చూపిన మార్గం
మాకు సదా స్మరణీయం, అనుసరణీయం.
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ....

శ్రీ మెర్ల చంద్రశేఖరరావు
అధినేత
కళ్యాణి గ్రూప్ ఆఫ్ పాలీస్
మెర్ల రామమ్మ మెమోరియల్ ట్రస్టు
జననం : 02-02-1958 మరణం : 01-06-2022

భార్య : మెర్ల వసుంధర రాణి
కుమారుడు : మెర్ల వంశీ విజయ్ కళ్యాణ్
కుమార్తె : అంకుశరావు ప్రియదర్శిని కళ్యాణి, అల్లుడు : అంకుశరావు శివ ఆదిత్య

మనవళ్లు
సాయితేజ M.B.B.S
సాయి హర్ష B.Tech

కంభంపాటి సూర్యచంద్రరావు
భార్య : స్వరాజ్యలక్ష్మీ
గన్నవరం

పాలడుగు వెంకట రామ ప్రసాద్ (నాని)
భార్య : అనంతలక్ష్మీ
పాలడుగు సుధాకర్

J.Srinivasarao
MLA, Chittor

Surendra Goud
Bangalore

Alamgur Sivanna
Bangalore

Surapaneni Subhakarrao
Champion Bangalore

Gogineni Anil
Vijayawada

Jaswanth Kumar
Hyderabad

Bhaskar Reddy
Hyderabad

Sudheer Reddy
Hyderabad

Kondal Reddy
Hyderabad

Manesh Jain
Bangalore

Lok Ranjan
Bangalore

Johnson
Mysore

పెద్ద కర్మ : గన్నవరం ఎయిర్‌పోర్టు సమీపంలోని ఎ.బి. కన్వెన్షన్ సెంటర్‌లో
ది. 15-06-2022, బుధవారం మధ్యాహ్నం 12-00గం॥లకు నిర్వహించబడును.

మతహింసతో లౌకికవాదానికి ముప్పు

సీపీఐ కార్యదర్శి నారాయణ హెచ్చరిక

సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ. వేదికపై అజీజ్ పాషా, పల్లా వెంకటరెడ్డి, రాములు, జంగయ్య తదితరులు

విశాలాంధ్ర-హైదరాబాద్: మహోన్నత చరిత్రకు గుర్తుగా నిరంతర పోరాటాలు సాగిస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలు చరిత్ర పుటల్లో నిలిచిపోవాలని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఆకాంక్షించారు. కమ్యూనిస్టు పార్టీకి ఇప్పటికీ ప్రజాభిమానం బలంగా ఉందని, కమ్యూనిస్టు పార్టీ సారధ్యంలో సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ప్రజలు ఇంకా గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర మహాసభల ద్వారా సీపీఐకి పూర్వవైభవం తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ మఖ్దూమ్ భవన్‌లో సీపీఐ తెలంగాణ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం మంగళవారం జరిగింది. నారాయణతోపాటు సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యులు సయ్యద్ అజీజ్ పాషా, సీపీఐ రాష్ట్ర ఇన్‌చార్జి కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య, సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ తదితరులు వేదికపై ఆశీనులయ్యారు. నారాయణ మాట్లాడుతూ బీజేపీ విభజన రాజకీయాలు మత హింసను పెంచుతున్నాయని, దీనివల్ల లౌకికవాదం ప్రమాదంలో పడిందని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, గిరిజన, మైనారిటీలపై దాడులు కొనసాగుతున్నాయని చెప్పారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను ధ్వంసం చేస్తూ వైవిధ్యభరితం, సుసంపన్న భారత్‌ను అఖండ హిందూ దేశంగా మార్చే ప్రయత్నం మోదీ సర్కారు చేస్తోందని విమర్శించారు. పాలకుల తప్పుడు ఆర్థిక విధానాలు ప్రజా జీవితంపై తీవ్రప్రభావం చూపుతున్నాయని మండిపడ్డారు. ప్రశ్నిస్తే దేశద్రోహం లేదా ఈడీ, సీబీఐ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వెలిబుచ్చారు. మోదీ సర్కారు హయాంలో అసమానతలు, నిరుద్యోగం, వ్యవసాయ, కార్మికవర్గాలలో అశాంతి పెరిగాయన్నారు. రాష్ట్రంలోనూ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని, ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో పేదల భూములను పోలీసులను అడ్డుపెట్టుకొని బలవంతంగా లాక్కుంటు న్నారని ఆయన ఆరోపించారు. కేంద్రలో ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రధాని మోదీ...రాష్ట్రంలో ప్రజాసమస్యలు పరిష్కరించడంలో విఫలమైన కేసీఆర్‌లకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు నిర్మించాలన్నారు. సెప్టెంబర్ 4 నుండి 7 వరకు శంషాబాద్‌లో జరిగే సీపీఐ తెలంగాణ రాష్ట్ర మహాసభల గురించి సృజనాత్మక పద్ధతుల్లో ప్రచారం నిర్వహించి విజయవంతం చేయాలని నారాయణ కోరారు. సీపీఐ సీనియర్ నాయకులు పుస్తకాల నర్సింగ్‌రావు, తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్.అంజయ్య నాయక్, రాష్ట్ర బీసీ హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి పాండు రంగాచారి, రంగారెడ్డి జిల్లా నాయకులు కావలి నరసింహ, ప్రభులింగం, ఓరుగంటి యాదయ్య, పనుఘంటి పర్వతాలు, వెం.ఆదిరెడ్డి, కె.రామస్వామి, సయ్యద్ అఫ్సర్, బుద్ధుల జంగయ్య, ఫామీద, సీఆర్ ఫౌండేషన్ సభ్యులు సీహెచ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతం

తల్లి ఒడికి పాప..నలుగురు మహిళలు అరెస్టు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : విజయవాడ రైల్వేస్టేషన్‌లో మూడేళ్ల చిన్నారి అపహరణ కథ సుఖాంతమైంది. రైల్వే అడిషనల్ డీజీ కుమార్ విశ్వజిత్, విజయవాడ రైల్వే డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ వాలేశ్వరరావులు రైల్వే ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జూన్ 8వ తేదీ సాయంత్రం 10వ నెంబర్ ప్లాట్‌ఫాం వద్ద తమ పాప షేక్ హనీఫా (3) కనిపించకుండా పోయినట్లు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన సీఐ పి.శ్రీనివాస్ ఆర్పీఎఫ్ కార్యాలయంలో ఉన్న సీసీ కెమెరా పుటేజీని పరిశీలించారు. అందులో ఇద్దరు మహిళలు పాపను తీసుకు వెళుతున్న దృశ్యాలు కనిపించటంతో ప్రత్యేక బృందాలను నియమించి పాప కోసం గాలింపు చేపట్టారు. పాపను అపహరించిన మహిళల గురించి అన్ని పోలీస్ స్టేషన్‌లలో సమాచారం అందించారు. చివరకు ఆ ఇద్దరు మహిళలు గుడివాడ కు చెందిన కోరుకొండ విజయలక్ష్మి(35),మేకల పద్మజ (చిన్నారి)గా గుర్తించారు. ఈ ఇద్దరూ కలిసి చిన్నారిని అపహరించారు. అయితే దీనికి ప్రధాన సూత్రధారి పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన అమరవరపు లక్ష్మి (45). ఈమె రైల్వేస్టేషన్‌లో కాంట్రాక్ట్ లేబర్‌గా సఫాయివాలా పనులు చేస్తుంది. 10 రోజుల క్రితం పై ఇద్దరు మహిళలు వచ్చి తమకు ఒక పాప కావాలని కోరారు. దాంతో లక్ష్మి... రైల్వేస్టేషన్‌లో గత కొన్నిరోజులుగా ఉంటున్న షేక్ మీర్జావలి,ఎస్‌కె హుస్సేన్ దంపతులకు చెందిన పిల్లలు ఎస్కే సిధిలి ఫాతిమా(5),ఎస్. హనీఫా(3) ఉన్నారని వారిలో చిన్న పాపను కిడ్నాప్ చేస్తే ఎవరికి అనుమానం రాదని చెప్పడంతో విజయలక్ష్మి,పద్మజ వచ్చి షేక్ హనీఫా ను ఎత్తుకెళ్లి పోయారు. పాపను తెలంగాణ లోని సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి గ్రామానికి చెందిన చందన పద్మ(45)కు రూ.రెండు లక్షలకు విక్రయించేందుకు ఒప్పందం చేసుకున్నారు. దానిలో భాగంగా మంగళవారం తెల్లవారుజామున కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నం వద్ద అ డబ్బులు తీసుకుని పాపను వారికి అప్పజెపుతుండగా ప్రత్యేక పోలీస్ బృందం దాడి చేసి మొత్తం ముగ్గురుని అదుపులోకి తీసుకుని పాపను కాపాడారు. అనంతరం రైల్వే పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేయగా ఈ కేసులో ప్రధాన సూత్రధారి కాంట్రాక్ట్ సఫాయివాలా లక్ష్మి అని నిర్ధారణయింది. దీంతో ఆమెను కూడా అదుపులోకి తీసుకుని నిందితులు నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పాపను చైల్డ్ లైన్, ఐసీడీసీ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. పాప ఆచూకీ కనుగొనడంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ ప్రత్యేక టీము సభ్యులను అడిషనల్ డీజీ విశ్వజిత్, కమిషనర్ వాలేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఏఎస్పీ జి.మధుసూదనరావు, జీఆర్పీ సీఐలు పి.శ్రీనివాసరావు, సాయినాథ్, బంగార్రాజు, ఆర్పీఎఫ్ సీఐ టీఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ముప్పాళ్ల. పక్కన జంగాల, రాజు, రంగారెడ్డి, శివాజీ తదితరులు

మతోన్మాద శక్తులను ఓడించాలి: ముప్పాళ్ల

విశాలాంధ్ర-తాడికొండ: మతోన్మాద శక్తులను ఓడించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. సీపీఐ గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గ 24వ మహాసభ మంగళవారం ఇక్కడ జరిగింది. ముందుగా ముప్పాళ్ల జెండా ఆవిష్కరణ చేసి ఎర్రజెండా కింద పనిచేసి అశువులు బాసిన అమరవీరులకు జోహార్లు అర్పించారు. ప్రసంగాన్ని కొనసాగిస్తూ కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ముస్లింలు, దళితులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. అగ్రిగోల్డ్ బాధితులకు టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు న్యాయం చేయలేక పోయాయని విమర్శించారు. అమరావతి రాజధానిపై సీపీఐ మరిన్ని పోరాటాలు కొనసాగిస్తుందని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ జులై 23, 24 తేదీలలో తుళ్లూరులో జరిగే జిల్లా మహాసభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, జిల్లా కార్యదర్శి కొల్లి రంగారెడ్డి, అధ్యక్షులు పచ్చల శివాజీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాబోతూ ఈశ్వరరావు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నాసర్ బి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, హనుమంతరావు, పార్టీ నాయకులు పచ్చల శివాజీ, జీవి రాజు , ముప్పాల శివ శంకర రావు, రామినేని రామారావు, బైరాపట్నం రామకృష్ణ, గుంటుపల్లి వెంకటేశ్వరరావు, మునుగోడు శ్రీనివాసరావు , అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాచైతన్యానికి నూతన కళారూపాలు

మాట్లాడుతున్న రామకృష్ణ. పక్కన పీజే చంద్రశేఖరరావు, చంద్రానాయక్, పెంచలయ్య, పిచ్చయ్య తదితరులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పార్టీ రాష్ట్ర, జాతీయ మహాసభలకు నూతన కళారూపాలతో సిద్ధం కావాలని కళాకారు లకు సీపీఐ రాష్ట్ర కార్య దర్శి కె.రామకృష్ణ పిలుపు నిచ్చారు. విజయ వాడలోని దాసరి భవన్‌లో ఆంధ్రప్ర దేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ఆఫీసు బేరర్ల సమావేశం పి.చంద్రా నాయక్ అధ్యక్షతన మంగళ వారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ అధికారాన్ని చేపట్టిన తర్వాత నిత్యం ప్రజల జీవన విధానంపై దాడి చేస్తూ ప్రజలను భయ భ్రాంతులకు గురిచేయడం పరిపాటిగా మారిందన్నారు. ఆరెస్సెస్, బజరంగదళ్, బీజేపీ నేతలు మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అశాంతి వాతావరణం సృష్టిస్తున్నారని విమర్శించారు. వీరి అరాచకాలపై కొత్త రకం కళా రూపాలను రూపొందిం చాలని సూచించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, వారు ఉద్యోగులనే విషయాన్ని విస్మరించి వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. కళాకారుల పాటల్లో, ఆటల్లో, పల్లె సుద్దులు చెప్పేటప్పుడు ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపించాలని సూచించారు. అప్పుడే ప్రజలను కళాకారుల ఆట పాటలు ఆకట్టుకుంటా యన్నారు. మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖరరావు మాట్లాడుతూ జరగబోయే సీపీఐ రాష్ట్ర, జాతీయ మహాసభలకు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర ఆఫీస్ బేరర్లు అందరూ తీసుకున్న బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల ప్రజానాట్యమండలి సంయుక్తంగా హైదరాబాదులో నిర్వహించే వర్క్ షాపునకు, అందుబాటుల్లో ఉన్న నూతన, యువ రచయితలు, కవులను హైదరాబాద్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.రామకృష్ణ, కోశాధికారి ఆర్. పిచ్చయ్య ఆఫీస్ బేరర్లు గుర్రప్ప, నాగరాజు, నజీర్, మారెళ్ల శ్రీనివాసులు, ఆర్.రామారావు, శివయ్య, అమర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణమూర్తి, పక్కన సత్యనారాయణ, సత్తిబాబు తదితరులు

గిరిజనులతోనే అడవులకు రక్షణ

జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-సీలేరు: గిరిజనుల కారణంగానే అడవులు ఇంకా మిగిలున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జీకేవీధి మండలం దారకొండ పంచాయతీ గంగ వరంలో ఇంగువ రామారావు అధ్యక్షతన సీపీఐ జీకేవీధి మండల 19వ మహాసభ మంగళవారం ఘనంగా జరిగింది. జేవీ సత్యనారయణమూర్తి మాట్లాడుతూ అడవుల రక్షకులు గిరిజనులేనని స్పష్టంచేశారు. అటవీశాఖ లేదా మరెవరో వాటిని రక్షించడం లేదన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాకే అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని పోరాటం చేశామని, ఫలితంగా కొత్తగా ఏర్పడిన ఏజెన్సీ జిల్లాకు అల్లూరి పేరు పెట్టడం ముదావహమన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలపై దాడి జరుగుతోందని, దాన్ని తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. టూరిజం వల్ల గిరిజన సంస్కృతి, సంప్రదాయాలపై దాడి జరుగుతోందని, భూబదలాయింపు నిషేధ చట్టం ఉన్నప్పటికీ బినామీలతో నిర్మాణాలు చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా కన్వీనర్ పొట్టిక సత్యనారాయణ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ పోరాట ఫలితంగా అటవీ హక్కుల చట్టం వచ్చిందని, చట్టం ప్రకారమే ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు వచ్చాయన్నారు. అయినా వాటిని ప్రభుత్వం ఆన్‌లైన్ చేయలేదని, ఆన్‌లైన్ కోసం పోరాటం చేద్దామని చెప్పారు. జిల్లా నాయకులు సుంకరి విష్ణుమూర్తి, మొట్టడం రాజబాబు మాట్లాడుతూ కమ్యూ నిస్టులు ప్రజల కోసం కొవ్వొత్తుల్లా కరిగిపోతూ ఇతరులకు వెలుగునిస్తున్నారన్నారు. సీపీఐ మండల కార్యదర్శి కంకిపాటి సత్తిబాబు, నాయకులు పర్ధాని సోమ్రు, దేశగిరి కృష్ణారావు, టిసుబాబు, గోపినాథ్, దొర నారాయణ, త్రినాథ్, శ్రీరామరాజు, చిరంజీవి, నాయకులు, సానుభూతి పరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీని సమగ్రంగా అమలు చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు ఆరోగ్యశ్రీ పథకాన్ని సమ గ్రంగా అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్యశ్రీ పథకంలో ఆటో డెబిట్ విధానం తీసుకు వస్తున్నట్లుగా ప్రచారముందని, వెయ్యి రూపాయలపైన ఆరోగ్యం కోసం ఆస్పత్రిలో ఖర్చు పెడితే ఆరోగ్యశ్రీ కింద జమ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా ఇంతవరకూ ఆ హామీ అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆస్పత్రులలో వెయ్యి రూపాయల పైన ఖర్చయ్యే ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ కింద నమోదు చేసి అందించాలని, అందుకు మార్గదర్శకాలను తక్షణమే రూపొం దించాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం క్రింద తల్లిదండ్రుల ఖాతాలో ఫీజుల చెల్లింపులో ఆలస్యమవుతున్నందున విద్యార్థుల సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని ఆటో డెబిట్ విధానంలోకి తీసుకువచ్చే ముందు ఏ విధమైన సమస్యలు లేకుండా రోగిని దృష్టిలో పెట్టుకుని తక్షణం వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రక్తదానంపై అవగాహన అవశ్యం

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనీ

విశాలాంధ్ర-విజయవాడ : ఎంతో విలువైన మానవ జీవితాలను పునరుజ్జీవింపజేసే రక్తదానం ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజనీ అన్నారు. నిండు జీవితాన్ని రక్షించడం గొప్ప వరంగా భావించాలని, ఇందుకు రక్తదానం ఒక్కటే సరైన మార్గమని చెప్పారు. 'ప్రపంచ రక్తదాతల దినం'ను పురస్క రించుకుని ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ, ఇండియన్ రెడ్ క్రాస్, గుంటూరు స్వశక్తి భాగ స్వామ్యంతో మంగళవారం ఉదయం వర్సిటీలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిం చారు. మంత్రి రజనీ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ రక్తశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది రక్తం అందక మృత్యు వాత పడుతున్నారని, దీనిని నివారించేందుకు భారత ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంస నీయమైనదని చెప్పారు. స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి విద్యార్థులు ముందుకు రావాలని కోరారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం మన దేశంలో ఏడాదికి రెండు మిలియన్ యూనిట్ల రక్తం లోటుతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ సమస్యను నివారించేందుకు ప్రభుత్వ పరంగా చేస్తున్న ప్రయ త్నాలు ఫలప్రదం అవుతున్నాయన్నారు. ఇంత ప్రాధాన్యతతో కూడిన గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ యాజమాన్యాన్ని అభినందించారు. తమిళ నాడులో అతి పెద్ద బ్లడ్ బ్యాంకు నిర్వహి స్తున్న ఎస్‌ఆర్ ఎం గ్రూప్ సీఎస్‌ఆర్ కార్యక్రమాలను మంత్రి ప్రస్తావిస్తూ, ప్రెసిడెంట్ డాక్టర్ సత్య నారాయణన్‌కు అభినందనలు తెలిపారు. యూని వర్సిటీ ప్రో-వైస్ చాన్సలర్ ఆచార్య డి.నారాయణ రావు యూనివర్సిటీ ప్రగతిని వివరిస్తూ నాలుగేళ్లలో రీసెర్చ్‌లో సాధించిన అభివృద్ధిని వివరించారు. వైద్య, ఆరోగ్య రంగంలో ఎదురవుతున్న సవాళ్లను ప్రస్తావిస్తూ వాటిని అధిగమించేందుకు చేసిన పరిశోధనల గురించి తెలిపారు. ఈ శిబిరంలో 139 మంది విద్యార్థులు, ఉద్యోగులు రక్తదానం చేశారు. వారికి రజనీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు. మంత్రి రజనీని ఆచార్య నారాయణ రావు, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రేమ్ కుమార్ దుశ్శా లువాతో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గుంటూరు చాప్టర్ చైర్మన్ రామచంద్రరాజు, గుంటూరు యూత్ సర్వీసెస్ సీఈవో వి.శ్రీనివాస రావు, ఎస్‌ఆర్‌ఎం వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మణావు, డీన్ ప్రొఫెసర్ బీవీ బాబు, స్టూడెంట్ ఎఫైర్స్ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ రేవతీబాలకృష్ణన్, డాక్టర్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. యూనివర్సిటీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ లక్ష్మీరాజ్యం, డాక్టర్ లక్ష్మీకిరణ్ ఈ రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షించారు.

ఆర్థిక లావాదేవీల ఉత్తర ప్రత్యుత్తరాలను బహిర్గతం చేయాలి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో వాస్తవ ఆర్థిక పరిస్థితిని మరుగునపెట్టి తప్పుడు లెక్కలతో అటు కేంద్ర ప్రభుత్వాన్ని, ఇటు రాష్ట్ర ప్రజలను జగన్ ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న రుణాలు, ఉపయోగిస్తున్న నిధులపై కేంద్ర ప్రభుత్వం నీతిఆయోగ్, రిజర్వ్ బ్యాంక్‌తో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు, అందించిన నివేదికలు, ఆ సంస్థలు ఇచ్చిన ఆదేశాలు, అందులో రాష్ట్రప్రభుత్వం అమలు చేసినవి, అమలు చేయని వివరాలను మొత్తం బట్టబయలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆదాయాలతో సంబంధం లేకుండా విచ్చలవిడిగా అధిక వడ్డీలకు అప్పులుతెస్తూ రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతోందన్నారు. ఒక తప్పును సరిద్దిదానికి మరో తప్పు చేస్తూ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడుతోంది. అప్పులున్న వాడివెంట నడవరాదని పెద్దలు చెబుతూ ఉంటారు. రాష్ట్రంలోని పరిస్థితి చూసి పెట్టుబడులు పెట్టడానికి, అప్పులివ్వడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. అర్హతకు మించి రుణాలు తీసుకోవడం, కేంద్రం ఇచ్చిన నిధులను ఇష్టానుసారంగా బదిలీ చేసి ప్రజా ప్రయోజనాలను రాష్ట్ర ప్రభుత్వం దెబ్బతీస్తోంది. రాష్ట్రంలో ఆర్థిక క్రమశిక్షణ లోపించడంతో వేజ్ అండ్ మీన్స్ అడ్వాన్స్ పరిమితులపై కూడా రిజర్వ్ బ్యాంక్ ఆంక్షలు విధించింది. కేంద్ర ప్రాయోజిత పథకాలైన ఉపాధి హామీ, రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా), వ్యవసాయ యాంత్రీకరణ సబ్‌మిషన్, సుస్థిర వ్యవసాయ కమిషన్, ఆయిల్ పామ్ మిషన్, జాతీయ ఆహార భద్రత మిషన్, రోజ్‌గార్ యోజన, సడక్ యోజన, జల్‌జీవన్ వంటి పథకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంత వ్యయం చేస్తుంది? ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఇచ్చే ప్రత్యేక నిధులను సైతం రాష్ట్ర వాటా జోడించి ఖర్చు చేయడంలో విఫలం కావడంతో ఆ నిధులు సైతం వెనక్కివెళ్లాయి. 14,15 ఆర్థిక సంఘం నుంచి రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి ఇచ్చిన రూ.6వేల కోట్లు ఏమయ్యాయి? జల జీవన్ మిషన్ కింద రాష్ట్రానికి వచ్చిన రూ.7 వేల కోట్లు ఏం చేశారు..ఎక్కడ ఖర్చు పెట్టారు.? కేంద్రం ఎంత ఇస్తుందో ప్రజలకు వివరాలు తెలియజేయాలని యనమల డిమాండ్ చేశారు.

వేటకు వేళాయె

నేటినుంచి సముద్రంలోకి జాలర్లు
ముగిసిన నిషేధకాలం
తీరం వెంబడి కోలాహలం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: చేపలవేటకు వేళయింది...61 రోజుల నిషేధ కాలం ముగియడంతో మత్స్యకారులు మళ్లీ సముద్ర బాట పట్టేందుకు సన్నద్ధమయ్యారు. తూర్పు తీరంలో బుధవారం నుంచి చేపల వేట మొదలు కానుంది. తొలి విడతలో విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి సుమారు 400 బోట్లు వేటకు పయనం కానున్నాయి. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్14 వరకూ చేపలవేటపై నిషేధం అమలు చేస్తున్నారు. చేపలు గుడ్లు పెట్టి సంపదను ఉత్పత్తి చేసే ఈ కాలంలో వేటను శాస్త్రీయంగా నిషేధించారు. కాగా చేపలవేటే జీవనాధారంగా ఉన్న మత్స్యకారులు ఈ విరామ కాలంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పూట గడవక కుటుంబాల్లో తీవ్ర ఆవేదన నెలకొంది. ఏళ్లు గడుస్తున్నా... ప్రభుత్వాలు మారుతున్నా వేలాది మంది మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపడటం లేదు. అనేక మంది మత్స్యకారులు బోట్లలో కార్మికుల గానే పనిచేస్తున్నారు. వాడ నరసాపురం, తంతడి, కొత్తపట్నం, ముత్యాలమ్మపాలెం, వాడపాలెం ప్రాంతాలనుంచి మత్స్యకారులు వేటకు వెళ్లనున్నారు. పూడిమడక తీరప్రాంతంతో పాటు సముద్రం పొడవున వేట ప్రారంభం కానున్న నేపథ్యంలో గ మంగళవారం గంగమ్మ తల్లి కి పూజలు నిర్వహించి వేటకు సిద్ధమయ్యారు. దీంతో ఈ ప్రాంతం కోలాహలంగా మారింది. ఈసారి ఐసు ధర గణనీయంగా పెరిగిందని, గత ఏడాది టన్ను ఐసు ధర రూ.1300 ఉంటే ఈ ఏడాది టన్నుకు రూ.1500 నుండి రూ.1800 గా నిర్ణయించారని మత్స్యకారులు తెలియజేశారు. ఐసు ధరతో పాటు ఇంధన ధరలు పెరిగిన నేపథ్యంలో అనేక ఇబ్బందులకు ఎదురొడ్డి చేపలను వేటాడేందుకు మత్స్యకారులు సిద్ధమయ్యారు. చేపల పరిశ్రమను వాణిజ్య రంగంలో చేర్చడం వల్ల చేపల రేవులో డీజిల్ ధర లీటరుకు రూ.21 పెరిగింది. పెరిగిన ధరల పై మత్స్యకారులు కేంద్రానికి విన్నపాలు చేసిన నేపథ్యంలో బహిరంగ మార్కెట్ ధరలకే చేపల రేవులో కూడా ఇంధనం లభిస్తుందని హామీ ఇవ్వడంతో ఊరట కలిగింది. రాష్ట్ర ప్రభుత్వం డీజిల్ రాయితీ కి అందించే చిప్ కార్డులు ఇంకా అందలేదని, పాత కార్డులు పనిచేయడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం లీటర్ డీజిల్‌కు రూ.9 చొప్పున రాయితీ కల్పిస్తుంది. విశాఖ ఫిషింగ్ హార్బర్ లో సుమారు 400 మంది కి పైగా రాయితీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ త్వరలో కార్డులు రానున్నాయని మత్స్య శాఖ ఏడి గోవిందరావు తెలిపారు. అయితే పాత వారికి రాయితీ ధర పై డీజిల్ ఇస్తారా ఇవ్వరా అన్నది గందరగోళంగా మారింది. వేట మొదలు కావడంతో వారం రోజుల్లో చేపలు ఫిషింగ్ హార్బర్‌లకు వస్తాయన్న ఆశతో మాంసాహార ప్రియులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గత రెండు నెలల పాటు సముద్ర చేపలు లేకపోవడంతో, ఏటి చేపలకు, రొయ్యలకు గిరాకీ ఏర్పడింది.

సైబర్ నేరాలపై రేపటి నుంచి అవగాహన

డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: దేశానికి స్వాతంత్ర్యం లభించి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 16వ నుంచి 18 తేదీ వరకు సైబర్ నేరాలపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం 16వ తేదీ విశాఖపట్నంలో ప్రారంభమవుతుందని, దీనిలో కేంద్ర హోంశాఖ, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సంగీత నాటక అకాడమీ వారి ప్రదర్శనలు, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా వారి ప్రదర్శన, సైబర్ క్రైమ్‌లపై నిపుణుల చర్చలుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని సమాజంలో పెరుగుతున్న కొత్తతరహా సైబర్ నేరాల నుంచి తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించుకోవాలని డీజీపీ కోరారు.

బుధవారం
15-06-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 70, సంచిక : 352
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

జులై 18 నుంచి పార్లమెంటు

న్యూఢిల్లీ : పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జులై 18 నుంచి ఆగస్టు 12 వరకు జరుగుతాయని అధికార వర్గాలు మంగళవారం తెలిపాయి. రాష్ట్రపతి ఎన్నికల తేదీ అయిన జులై 18 నుంచి సెషన్ మొదలు అయి ఆగస్టు రెండవ వారంలో అంటే 12వ తేదీతో ముగుస్తుందని పేర్కొన్నాయి. ఈ తేదీలను పార్లమెంటు వ్యవహారాల కేంద్ర కేబినెట్ సిఫార్సు చేసింది. ఈ సెషన్‌లో 17 పనిదినాలు ఉండవచ్చు. కాగా, గత సమావేశంలో పార్లమెంటు పరిశీలనకు సూచించిన నాలుగు బిల్లులూ ఈసారి ఆమోదం పొందే అవకాశం ఉందని అధికార వర్గాల సమాచారం.

దమనకాండను అడ్డుకోండి

- యూపీలో క్షీణిస్తున్న శాంతిభద్రతలు
- ముస్లింలకు రక్షణ కల్పించండి
- సీజేఐకి మాజీ జడ్జీలు, సీనియర్ న్యాయవాదుల లేఖ

న్యూఢిల్లీ:
ముస్లింలపై బీజేపీ పాలిత రాష్ట్రాలు ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం క్రూరంగా వ్యవహరిస్తోంది. అక్రమ కట్టడాల నెపంతో వారి ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తోంది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టుతో పాటు హైకోర్టుల మాజీ న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు స్పందించారు. ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ఎన్‌వీ రమణను లేఖ ద్వారా కోరారు. బీజేపీ ప్రజాప్రతినిధులు చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను ప్రతిఘటించిన నిరసనకారులపై పోలీసు చర్యలు, వారి ఇళ్ల కూల్చివేత, అక్రమ నిర్బంధాలను సీజేఐ దృష్టికి తీసుకెళ్లారు. ఉత్తరప్రదేశ్‌లో పౌరులపై ఆ రాష్ట్ర ప్రభుత్వం దమనకాండ సాగిస్తోందని, తాజా ఘటనలే అందుకు ఉదాహరణ అని పేర్కొన్నారు. తక్షణమే ఈ వ్యవహారాన్ని పరిశీలించాలని సీజేఐని కోరారు. బీజేపీ బహిష్కృత నేతలు ఇటీవల ప్రవక్త మహమ్మద్‌పై చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీశాయని వెల్లడించారు. నిరసనకారుల వాదన వినకుండా అణచివేతే లక్ష్యంగా యూపీ ప్రభుత్వం హింసాత్మక చర్యలకు అనుమతినిచ్చిందని విమర్శించారు. జాతీయ భద్రతా చట్టం -190, ఉత్తరప్రదేశ్ గూండాలు, సంఘ విద్రోహ కార్యకలాపాలు (నివారణ) చట్టం, 1985 కింద నిరసనకారులపై చర్యలకు సీఎం ఆదేశాలివ్వడం ఖాకీ క్రౌర్యానికి తెరతీసినట్లు అయిందని న్యాయనిపుణులు ఆందోళన వ్యక్తంచేశారు. యూపీలో ఇప్పటికే 300 మందికిపైగా అరెస్టు చేశారు. అనేక సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. పోలీసు కస్టడీలో యువకులపై లాఠీలు ఝుళిపిస్తుండటం, వారి ఇళ్లను ముందస్తు నోటీసులు లేకుండా కూల్చివేస్తుండటం ముస్లింల అణచివేతకు అద్దం పడుతోందని పేర్కొన్నారు. ముస్లింలను వెంబడించి మరీ పోలీసులు కొడుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయని తెలిపారు. పౌరుల పట్ల పాలకపక్షం క్రూరంగా వ్యవహరించడం ఆక్షేపణీయమన్నారు. ఇలాంటి వైఖరి రాజ్యాంగాన్ని, ప్రాథమిక హక్కులను అపహాస్యం చేయడమే అవుతుందని వెల్లడించారు. ఇటువంటి క్లిష్ట సమయాలు న్యాయ వ్యవస్థ పటిమకు పరీక్ష పెడతాయని, ఈ మధ్య అనేక సవాళ్లను సమర్థంగా అధిగమించి ప్రజల హక్కులను న్యాయ వ్యవస్థ పరిరక్షించిందని గుర్తు చేశారు. వలస కార్మికులు, పెగాసస్ వ్యవహారాలను

- మిగతా 2 లో

మోదీ 'మిషన్ 2024'

18 నెలల్లో 10లక్షల ఉద్యోగాలు

కేంద్ర శాఖల్లో భర్తీకి ప్రధాని ఆదేశాలు

న్యూఢిల్లీ:
కేంద్రంలోని మోదీ ప్రభుత్వం స్వలాభం లేనిదే ఏమీ చేయదు. తాజాగా ఏడాదిన్నర కాలంలో పది లక్షల కేంద్రప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ప్రధాని మోదీ ఆదేశాలిచ్చారు. 2024 లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా ఈ ప్రకటన చేశారు. దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగం గురించి ప్రతిపక్షాలు ఎప్పటికప్పుడు అధికార పక్షాన్ని నిలదీస్తూనే ఉన్నాయి.

కాబట్టి నిరుద్యోగం 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారాస్త్రంగా మారకుండా ఉండాలనే ఉద్దేశంతోనే మోదీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు అభిప్రాయం ఉంది. 2024, ఏప్రిల్-మేలో సార్వత్రిక ఎన్నికలు ఉంటాయి. ఆ లోగా ఈ కార్యం పూర్తి అయితే ప్రచార సమయంలో 18 నెలల్లో 10 లక్షల ఖాళీలను భర్తీ చేసినట్లు బీజేపీ గొప్పగా చెప్పుకునే వీలు ఉంటుంది. ఏడాదిన్నర కాలంలో 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ప్రధాని మోదీ ఆదేశాలిచ్చారని ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ) మంగళవారం ప్రకటించింది. అన్ని ప్రభుత్వ విభాగాలు, మంత్రిత్వ శాఖలలో మానవవనరుల స్థితిపై సమీక్ష నేపథ్యంలో తాజా ఆదేశాలను ప్రధాని ఇచ్చినట్లు ట్విట్టర్‌లో పేర్కొంది. వేతనాలు, అలవెన్సులపై వ్యయ శాఖ తాజాగా

- మిగతా 2 లో

ఇక ఒప్పంద సైనికులు

పింఛన్-వేతనాల వ్యయం తగ్గింపే ప్రధాన లక్ష్యం

'అగ్నిపథ్' పేరిట కేంద్రం కొత్త పథకం

లాంఛనంగా ప్రారంభించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్

న్యూఢిల్లీ :
భారత త్రివిధ దళాల్లో నియామకాలకు కొత్త పథకాన్ని కేంద్రం ప్రకటించింది. ఒప్పంద సైనికుల 'అగ్నివీర్'ను నియమించేందుకు, వేతనాలు, పింఛన్ బిల్లును తగ్గించే లక్ష్యంతో అగ్నిపథ్ పథకాన్ని తీసుకు వచ్చింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం విలేకరుల సమావేశంలో ఈ పథకాన్ని ప్రకటించారు. భద్రతపై కేంద్ర కేబినెట్ ఆమోదించిన కొద్ది సేపటికే ఆయన దీనిని లాంఛనంగా ప్రారంభించారు. ఈ పథకం ప్రకారం 17-21 మధ్య వయస్కులను నియమించి రూ.30-40వేల వరకు వేతనమిస్తారు. నాలుగేళ్ల సర్వీసు పూర్తైన తర్వాత ఎంపికైన వారిలో 25శాతం మందిని రక్షణ శాఖలో కొనసాగిస్తారు. మిగిలిన వారికి వన్‌టైమ్ బెనిఫిట్‌గా రూ.11లక్షలు లేదా రూ. 12 లక్షలను పదవీ విరమణ పొందేవారికి ఇస్తారు. తొలి దశలో 45వేల మంది ఈ సర్వీసులో చేర్చుకోవాలని రక్షణ శాఖ భావిస్తోంది. చిన్న వయసులో రక్షణ బలగాల నుంచి బయటకు రావడం ద్వారా వారి భవిష్యత్తుకు మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొంటోంది. రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, రక్షణ రంగంలో సంస్కరణాత్మక ముందడుగు 'అగ్నిపథ్' అని అన్నారు. సాయుధ దళాలకు యువశక్తి లభిస్తుందని అన్నారు. ఈ పథకం ద్వారా దేశం కోసం సేవ చేసే అవకాశం యువతకు లభిస్తుందని చెప్పారు. నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్ హరి కుమార్ మాట్లాడుతూ, యువతీయువకులు సాయుధ దళాల్లో నియమితులై తమ సామర్థ్యాన్ని మరింత పెంచుకోవచ్చు అని అన్నారు. సాయుధ దళాల్లోకి మహిళలను నియమిస్తున్నట్లు తెలిపారు. యువతకు, ఆర్మీలో అనుభవం ఉన్న వారికి మధ్య సమతుల్యత కోసం ఈ పథకం దోహదమవుతుందని ఆర్మీచీఫ్ జనరల్ మనోజ్ పాండే అభిప్రాయపడ్డారు. పథకం అమలు తొలి దశలో ఆర్మీ కార్యాకలపాల సామర్థ్యం పూర్తిస్థాయిలో ఉంటుందని అన్నారు. ఈ పథకాన్ని త్రివిధ దళాధిపతుల సమక్షంలో రక్షణ మంత్రి ప్రారంభించారు. అగ్నిపథ్‌ను తొలుత 'టూర్ ఆఫ్

- మిగతా 2 లో

అమలాపురం విధ్వంసం

వైసీపీ నేతలపై కేసు

విశాలాంధ్ర-అమలాపురం:
అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో అల్లర్లకు సంబంధించి మరో నలుగురిని పోలీసులు నిందితుల జాబితాలో చేర్చారు. ఇప్పటికే అరెస్టయి ఎ-222గా ఉన్న చీకట్ల వీరవెంకట సత్యప్రసాద్ ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం, రాయుడు సత్యరుషి, వాసంశెట్టి సుభాష్, మట్టపర్తి మురళీకృష్ణ, మట్టపర్తి రఘులపై నిందితులుగా కేసు నమోదు చేశారు. వీరు ప్రస్తుతం పరారీలో ఉన్నారని పోలీసులు వెల్లడించారు. గతనెల 24న అమలాపురంలో జరిగిన విధ్వంసంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అనుచరులుగా భావిస్తున్న ఈ నలుగురు వైసీపీ నాయకుల్ని గుర్తించి కేసులు నమోదు చేసినట్లు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు.

నలుగురు నిందితులు కోనసీమలో మంత్రి విశ్వరూప్ అనుచరులుగా, వైసీపీ క్రియాశీలక నేతలుగా గుర్తింపు పొందారు. వాసంశెట్టి సుభాష్ వైసీపీ నాయకుల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. విధ్వంసంలో ఈయన ప్రధాన కుట్ర దారునిగా పోలీసులు పేర్కొన్నారు. వీరిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని డీజీపీ వెల్లడించారు. అమలాపురం అల్లర్లలో మొత్తం 258 మందిని నిందితులుగా పోలీసులు గుర్తించారు. వారిలో ఇప్పటివరకు 142 మందిని అరెస్టు చేశారు. మరో 116 మంది పరారీలో ఉన్నారు. అమలాపురంలో చెలరేగిన అల్లర్లకు కీలక సూత్రదారిగా భావిస్తోన్న వైకాపా కార్యకర్త అన్యం సాయిని అమలాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి విదితమే. మంత్రి విశ్వరూప్ అనుచరుడిగా ఉన్న అన్యం సాయి.. ఈనెల 20న కోనసీమ సాధన సమితి ఆందోళనలో పాల్గొన్నారు. అమలాపురం కలెక్టరేట్ వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. అతనిపై గతంలోనే పోలీసులు రౌడీషీట్ తెరిచారు. తాజాగా అమలాపురంలో జరిగిన అల్లర్ల నేపథ్యంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు... అల్లర్లలో అన్యం సాయి పాత్రపై విచారణ చేస్తున్నారు.

దేశంలో రెండు న్యాయ వ్యవస్థలు ?

- లోపించిన జవాబుదారీతనం
- పేదలకు తీరని అన్యాయం
- సంపన్నుల జోలికి వెళ్లని అధికార యంత్రాంగం

న్యూఢిల్లీ :
దేశంలో రెండు సమాంతర న్యాయవ్యవస్థలు ఉన్నాయా అంటే అవుననే సంకేతాలు ఉన్నాయి. అందుకు వీల్లేదని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ ఇటీవల ముండ్కా అగ్నిప్రమాదం, జహంగీర్‌పురిలో కూల్చివేతలు రెండు సమాంతర న్యాయ వ్యవస్థలనే సూచిస్తున్నాయి. అందులో ఒకటి సంపన్నులు, రాజకీయ శక్తులు, కండ-ధన బలం కలిగిన ప్రముఖులది కాగా మరొకటి అన్యాయాన్ని ఎదిరించి న్యాయం పొందలేని నిస్సహాయులైన బలహీనుల కోసం అన్నట్లుగా పరిస్థితులు ఉన్నాయి. ఢిల్లీ చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు రాజధాని నగరంలో అనేక అక్రమ కట్టడాలు ఉండటం బహిరంగ సత్యం. ఢిల్లీలో 80శాతం అక్రమ కట్టడాలే అని సీఎం అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. బుల్డోజర్లను ఆపకపోతే దేశ రాజధానిలో 63 లక్షల మంది ప్రజలు నిరాశ్రయులవుతారన్నారు. అక్రమ కట్టడాల నెపంతో ఇళ్లను కూల్చివేస్తున్న మున్సిపల్ అధికారులు బలహీనులపై ప్రతాపం చూపుతున్నారేగానీ ధనవంతులు, ప్రముఖులు, రాజకీయ శక్తుల జోలికి వెళ్లడం లేదు. అక్రమ కట్టడాలు వెలిసినాగానీ వాటిని తాకే ధైర్యాన్ని చేయలేకపోతున్నారు.

1997లో చోటుచేసుకున్న ఉపహార్ సినిమా దుర్ఘటన, 2018, జనవరిలో బవానా పారిశ్రామిక వాడ విషాదం, 2019 డిసెంబరులో సర్దార్ బజార్‌లోని అనాజ్ మండీలో అగ్ని ప్రమాదం, ఇటీవలి ముండ్కా అగ్నిప్రమాదం వంటివి ఢిల్లీలో అనేకం చోటుచేసుకున్నాయి. వీటి గురించి సమాచారాన్ని ఢిల్లీ విద్యార్థి-యువజన సంఘం సేకరించింది. క్రిమినల్ నిర్లక్ష్యం జరిగిన వైనాన్ని వివరించింది. చాలా వరకు నిర్మాణాలు చీకట్లోనే జరిగిపోతున్నాయి. మరి మున్సిపల్ అధికారులు ఏం చేస్తున్నారు? అనుమతులు లేకున్నా కట్టడాలకు క్లియరెన్స్ ఎలా వస్తుంది? ఎంతో కొంత ముట్టిందని కళ్లు మూసుకుంటూ ప్రాణ నష్టానికి దారితీస్తున్నారు. అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకునే జాగ్రత్తలు వంటివి లేకున్నా, భవనం లోపలికి వెళ్లేందుకు వచ్చేందుకు ఒకటే మార్గం ఉన్నా పట్టించుకోవడం లేదు.ముండ్కా దుర్ఘటనలో 27మంది అగ్నికి ఆహుతి కాగా డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించి మృతులను గుర్తించాల్సి వచ్చింది. ఇటువంటి ఘటనలకు భవనాల యజమానులతో సమానంగా మున్సిపల్ అధికారులపైనా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మరోవైపు బుల్డోజర్లను వినియోగించి పేదల ఇళ్లు కూల్చివేస్తూ వారి ఆశలను ఆవిరయ్యేలా

- మిగతా 2 లో

22న రాష్ట్ర కేబినెట్ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :
రాష్ట్ర మంత్రిమండలి సమావేశం ఈ నెల 22వ తేదీ ఉదయం 11 గంటల నుంచి రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెలగపూడిలోని ఆంధ్రప్రదేశ్ సచివాలయం ఆవరణలోని ఒకటో బ్లాక్ లోని మొదటి అంతస్తులో ఈ సమావేశం జరుగుతుం దని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహిస్తున్న గడప గడపకూ కార్యక్రమంలో ప్రజల నుంచి పెద్దఎత్తున విజ్ఞప్తులు వస్తున్నాయి. వివిధ సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి నిబంధనలు కారణంగా అనేకమంది అర్హులైనప్పటికీ లబ్ధి పొందలేక పోతున్నారు. దీనిపై వారు ప్రజాప్రతినిధులను నిలదీస్తున్నారు. ఇటువంటి అంశాలపై కొన్ని సడలింపులు చేసే విషయం మంత్రివర్గంలో చర్చించే అవకాశముంది. ఇటీవల 10వ తరగతి విద్యార్థులు గత 20సంవత్సరాల్లో ఎన్నడూలేని విధంగా అతి తక్కువ శాతం ఉత్తీర్ణులయ్యారు. వీరికి కనీసం 5నుంచి 10 గ్రేస్ మార్కులు ప్రకటించాలన్న డిమాండ్ అధికార పార్టీ నేతల నుంచి వస్తోంది. దీనివల్ల కనీసం 10 నుంచి 15శాతం ఉత్తీర్ణత పెరగనుంది. గతంలో గ్రేస్ మార్కులు ప్రకటించిన సందర్భాలు చాలా ఉన్నాయి. దీంతో పాటు మరికొన్ని కీలక అంశాలపై మంత్రివర్గంలో చర్చకు రానున్నట్లు సమాచారం.

ఇదీ లోకం!



రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై

నేడు విపక్షాల భేటీ

కాంగ్రెస్, లెఫ్ట్, ఇతర పార్టీల హాజరు

పోటీ చేయలేనన్న శరద్ పవార్

న్యూఢిల్లీ:
రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి విపక్షాల ఉమ్మడి అభ్యర్థిపై చర్చించడానికి ప్రతిపక్ష పార్టీలు బుధవారం సమావేశం కానున్నాయి. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆమె అన్ని ప్రతిపక్షాల నేతలకు ఆహ్వానాలు పంపారు. ప్రతిపక్ష పార్టీల నేతలు రాజధాని ఢిల్లీకి చేరుకుంటున్నారు. మమతా బెనర్జీ ఏర్పాటు చేస్తున్న విపక్షాల సమావేశానికి కాంగ్రెస్ పార్టీ కూడా హాజరవుతుంది. ఆ పార్టీ

- మిగతా 2 లో

నేటి నుంచి రాష్ట్రపతి ఎన్నికల నామినేషన్లు 2లో

క్రాప్ హాలిడే పేరుతో రెచ్చగొడుతున్నారు

- అంబేద్కర్ పేరును జీర్ణించుకోలేకే విధ్వంసం
- రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్నాం
- చంద్రబాబు తానా.. దత్తపుత్రుడు తందానా
- చెన్నే కొత్తపల్లిలో సీఎం జగన్ విమర్శలు
- 15.61 లక్షలమంది రైతులకు రూ.2,977 కోట్లు జమ

విశాలాంధ్రబ్యూరో-అనంతపురం (చెన్నేకొత్తపల్లి):
రైతులకు మేలు చేయడంలో దేశంతోనే పోటీ పడుతున్నామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయరంగంలో చేపడుతున్న మార్పును పక్క రాష్ట్రాలు సైతం అమలు చేస్తున్నాయని తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా చెన్నే కొత్తపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో 2021 ఖరీఫ్‌లో పంట నష్టపోయిన 15.61 లక్షలమందికి రూ.2,977 కోట్ల పరిహారాన్ని జగన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ఈ మూడేళ్లలో రైతుల కోసం తమ ప్రభుత్వం రూ.1.28 లక్షల కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. ఇతర రాష్ట్రాల ప్రతినిధులు వచ్చి మన రైతు

- మిగతా 2 లో

సంపాదకీయం

గళమెత్తిన న్యాయ కోవిదులు

మహమ్మద్ ప్రవక్తపై బీజేపీ అధికార ప్రతినిధులు నూపుర్ శర్మ, నవీన్ జిందాల్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల చెలరేగిన హింసాకాండ, నిరసనకారులపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కొనసాగిస్తున్న చట్ట వ్యతిరేక దమనకాండను తనంత తాను పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కె.వి.రమణను కోరుతూ 12 మంది న్యాయ కోవిదులు లేఖ రాశారు. ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్ రాష్ట్రాలలో అక్రమ నిర్మాణాల నెపంతో నిరసన కారుల మీద చట్ట ప్రకారం చర్య తీసుకోకుండా వారి ఇళ్లను బుల్డోజర్ల సాయంతో కూల్చి వేస్తున్న ఉదంతాలను ఈ న్యాయకోవిదులు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చి తక్షణం జోక్యం చేసుకుని ప్రజల హక్కులను పరిరక్షించాలని కోరారు. కరోనా సమయంలో వందలాది కిలోమీటర్లు కాలి నడకన సొంత ఊళ్లకు వేలాది మంది ప్రజలు దిక్కు లేని స్థితిలో బయలుదేరినప్పుడు సుప్రీంకోర్టు తనంత తాను జోక్యం చేసుకున్న సందర్భాన్ని ఈ న్యాయకోవిదులు ప్రధాన న్యాయమూర్తికి గుర్తు చేశారు. ఇలాంటి సమయంలోనే అత్యున్నత న్యాయ వ్యవస్థ సత్తువ వ్యక్తం అవుతుందని వారు అభిప్రాయ పడ్డారు. ఇటీవలి కాలంలో సుప్రీంకోర్టు అనేక సవాళ్లు ఎదుర్కోవలసి వచ్చినా ప్రజల హక్కులకు పూచీ పడ్డ సందర్భాలను ఈ న్యాయ నిపుణులు గుర్తు చేశారు. రాజ్యాంగం నీరుగారి పోకుండా చూడవలసిన బృహత్తర బాధ్యత అత్యున్నత న్యాయస్థానం మీద ఉందన్నారు. మరో వేపు నిందితులని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ముద్ర వేసిన వారి మీద చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తూ వారి ఇళ్లను బుల్డోజర్లతో నేలమట్టం చేయడాన్ని నిరోధించాలని జమాత్-ఎ-ఉలేమ-హింద్ సుప్రీం కోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేసింది. ఒక్క శుక్రవారం రోజే పోలీసులు ఉత్తర ప్రదేశ్‌లో 333 మందిని నిర్బంధించారు. వారంతా ముస్లింలే కావడం గమనార్హం. ప్రభుత్వమే చట్ట వ్యతిరేకంగా వ్యవహరించడం సహజ న్యాయాన్ని ఉల్లంఘించడమే. న్యాయ వ్యవస్థ ఇలాంటి దుర్నీతిని అనుమతించకూడదు. బుల్డోజర్ దమన నీతిపై తక్షణం సుప్రీం కోర్టు చర్య తీసుకోవాలని 12 మంది న్యాయకోవిదులు కోరడం కారు చీకటిలో కాంతి రేఖ అనుకోవలసిందే. ఈ పన్నెండు మంది న్యాయ కోవిదుల్లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు, హైకోర్టుల మాజీ న్యాయమూర్తులు, ప్రసిద్ధ న్యాయవాదులూ ఉన్నారు. ఉద్యోగ విరమణ చేసిన న్యాయమూర్తులు స్పందించడం ఈ తరుణంలో న్యాయం జరుగుతుందన్న ఆశ రేకెత్తిస్తోంది. ప్రజల హక్కులకు భంగం కలుగుతున్న దశలో కలగజేసుకోవడం సుప్రీంకోర్టు బాధ్యత. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు శాంతిభద్రతలను మరింత దిగజార్చేవిగా ఉన్నాయి. ఈ దారుణ పరిస్థితి ఇతర చోట్ల కూడా తక్కువ స్థాయిలోనైనా వ్యక్తం అవుతోంది. రాంచీలో ముస్లింలు శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తున్నప్పటికీ పోలీసులు పనిగట్టుకుని, అవసరం లేకపోయినా లాఠీ చార్జీ చేయడంవల్ల పరిస్థితి విషమించింది. ప్రభుత్వ అకృత్యాలకు వ్యతిరేకంగా నిరసన తెలియజేసే హక్కు ప్రజలకు ఉంటుందని, ప్రజాస్వామ్య మూలసూత్రం ఇదేనని గుర్తించే స్థితిలో బీజేపీ ప్రభుత్వాలు లేకపోవడం విచారకరం. నిజానికి ప్రభుత్వ చర్యలే శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నాయి. మహమ్మద్ ప్రవక్త మీద అవమానకరమైన వ్యాఖ్యలకు నిరసన వ్యక్తం చేయడానికి, అలాంటి నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్న వారి ఇళ్లను ఏరి కోరి బుల్డోజర్లతో కూల్చి వేయడానికి సంబంధం ఏమిటో ఎంత తరచి చూసినా అంతుబట్టని వ్యవహారంగానే మిగిలిపోతోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ కూటనీతి వెనక ముస్లింలంటే ద్వేషం ఉందని ప్రత్యేకంగా చెప్పవలసిన పని లేదు.

ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసిన 12 మంది న్యాయకోవిదుల్లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు బి. సుదర్శన్ రెడ్డి, వి.గోపాల గౌడ, అశోక్ గంగూలి; ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎ.పి.షా, మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి కె. చంద్రు, కర్నాటక హైకోర్టు మాజీ న్యాయమూర్తి మహమ్మద్ అన్వర్‌తో పాటు ప్రసిద్ధ న్యాయవాది, జనతా ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రి శాంతి భూషణ్, ఆయన కుమారుడు ప్రశాంత్ భూషణ్; ప్రముఖ న్యాయవాదులు ఇందిరా జై సింగ్, ఆనంద్ గ్రోవర్, చంద్ర ఉదయ్ సింగ్, శ్రీ రాం పంచు ఉన్నారు. న్యాయమార్గ పాలనకు భంగం కలగడాన్ని సహించని మాజీ న్యాయమూర్తులు, న్యాయవాదులు కొల్లలుగా ఉంటారు. వారంతా బయటకు వచ్చి గళమెత్తకపోవడం అంటే వారికి ఆవేదన లేదని కాదు. నిరసన తెలియజేస్తున్న వారు చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే వారి మీద చర్య తీసుకుంటే తప్పు పట్టవలసిన అవసరం లేదు. కానీ ప్రధానంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిరసనకారుల విషయంలో కత్తిగట్టినట్టు ప్రవర్తిస్తోంది. ఇతరేతర కారణాలు చూపి వారి మీద ఈ నిరసనలతో సంబంధం లేని సందర్భాలను చూపి దమనకాండకు పాల్పడుతోంది. ఇదంతా గమనిస్తే యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం దౌర్జన్య పూరితంగా వ్యవహరిస్తోందని స్పష్టం అవుతోంది. ప్రభుత్వం అనుమతి లేకుండా పోలీసు అధికారులో, ఇతర ప్రభుత్వ అధికారులో ప్రశాంతంగా నిరసన తెలియజేస్తున్న వారి విషయంలో విచ్చలవిడిగా ప్రవర్తించే పరిస్థితి ఉంటుందని ఊహించనైనా లేం. నిరసనకారుల మీద ఇలాంటి తీవ్ర చర్యలు తీసుకోవాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ఆదేశించడం దిగ్భ్రాంతికరం. నిరసనకారుల మీద కఠిన చర్య తీసుకుంటే ఇతరులకు గుణపాఠంగా ఉంటుందని యోగీ అనడంలో ఆంతర్యం న్యాయ మార్గ పాలనను తాను ఖాతరు చేయబోనని బాహాటంగా ప్రకటించడమే. నిరసనకారులపై 1980నాటి జాతీయ భద్రతా చట్టం, 1986 నాటి గాంగ్‌స్టర్లను, సంఘ వ్యతిరేక శక్తులను నిరోధించడానికి ఉద్దేశించిన చట్టాన్ని ప్రయోగించాలని కూడా యోగీ ఆదిత్యనాథ్ అంటున్నారు. అంటే చట్టాన్ని ఖాతరు చేయవలసిన అగత్యం లేదని, అణచివేతే ప్రధానమని స్పష్టంగా అధికారు లను కోరడమే. ఇలాంటి వ్యాఖ్యల కారణంగానే పోలీసులు నిరసనకారుల విషయంలో కిరాతకంగా ప్రవర్తిస్తున్న విషయాన్ని న్యాయకోవిదులు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. పోలీసు నిర్బంధంలో ఉన్న వారిని చితగ్గొట్టడం ప్రభుత్వమే చట్టాన్ని ఉల్లంఘించడమే. ముస్లింల మీద ప్రతీకారం తీర్చుకుంటున్నట్టుగా ప్రభుత్వాలే వ్యవహరిస్తుంటే సుప్రీంకోర్టు పట్టనట్టు మిన్నకుండి పోతే ఇక ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని దిక్కు తోచని స్థితి ఎదురవుతోంది. బుల్డోజర్లు ఉపయోగించడంలో పోలీసులకు, పట్టణాభివృద్ధి వ్యవస్థ అధికారులకు మధ్య ఎంత గట్టి అనుసంధానం ఉందో అర్థం అవుతోంది. ఇదే రాష్ట్ర ప్రభుత్వ విధానం అయితే అంతకన్నా ఘోరమైన పరిస్థితి ఏమీ ఉండదు. ప్రభుత్వమే చట్ట వ్యతిరేకంగా నడుచుకుంటే సామాన్య ప్రజలకు రక్షణ ఉండే అవకాశమే లేదు. వలస కూలీల విషయంలో, పెగాసస్ వ్యవహారంలో సుప్రీంకోర్టు తనంత తాను చర్య తీసుకుని ఆదర్శ ప్రాయంగా నిలిచింది. న్యాయం చెప్పడమే కాదు ప్రజల హక్కులను కాల రాయకుండా చూడవలసిన బాధ్యత కూడా సుప్రీంకోర్టు మీద ఉంది. ప్రజల ప్రాథమిక హక్కులు మంటగలుస్తుంటే సుప్రీంకోర్టు పట్టించుకోకుండా ఉండడం బాధ్యతను విస్మరించడమే. అనేక సందర్భాలలో మానవహక్కుల గురించి నిర్మొహమాటంగా మాట్లాడిన ప్రధాన న్యాయమూర్తి సానుకూలంగా స్పందిస్తారన్నదే చివరి ఆశ.

ఫలితంలేని సాగు వద్దంటున్న రైతు

రాష్ట్ర ప్రభుత్వం ముంపు విషయం పక్కన పెట్టి రైతుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకునే కాలువలు ఎప్పుడూ లేని విధంగా జూన్ 1 వ తేదీనే సాగుకు అనుకూలంగా ఏర్పాటు చేసాం అని చెబుతోంది. సాగునీరు రావడం ఎంత ముఖ్యమో మురుగునీరు పోవడం కూడా అంతే ముఖ్యం అనే విషయాన్ని మాత్రం ప్రభుత్వ పెద్దలు గుర్తించకపోవడం శోచనీయం. పైగా వ్యవసాయ అధికారులు హడావిడిగా సమావేశాలు ఏర్పాటు చేసి పంట విరామం ప్రకటించడం వలన భూమిలో లవణీకరణ చేరి భూములు చవుదు బారిపోతాయని దీని ప్రభావం భవిష్యత్‌లో పంట దిగుబడిపై తీవ్రంగా ఉంటుందని హెచ్చరికలు జారీ చేస్తున్నారు కానీ సమస్య పరిష్కారం దిశగా చిత్తశుద్ధి కనపరచడం లేదు అనేది మాత్రం సుస్పష్టం.

రుద్రరాజు శ్రీనివాసరాజు

పంట ఎక్కువ పండిస్తే ఎక్కువ నష్టం, తక్కువ పండిస్తే తక్కువ నష్టం, అసలు పండించకపోతే నష్టం ఉండదు. అయినా సేద్యం చేస్తూనే ఉన్నాం. నష్టపోతూనే ఉన్నాం. ఇప్పటికే రుణాల ఊబిలో పూర్తిగా కూరుకుపోయాం. ఇక మా వల్ల కాదు అంటూ కోనసీమ రైతులు 2 వ పర్యాయం ఖరీఫ్ పంట విరామానికి సిద్ధపడ్డారు. 11 సంవత్సరాల క్రితం పంట విరామ ఉద్యమం మొదటిసారిగా కోనసీమలోని అల్లవరం గ్రామంలో పురుడు పోసుకుంది. ఆ ఉద్యమం మిగిలిన ప్రాంతాలకు కూడా పాకి ఉద్యమం బలోపేతం అయ్యింది. గిట్టుబాటు ధరలు లేకపోవడం. ఖరీఫ్ పంటల విషయంలో మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవడం వలన తరచు ముంపునకు గురై నష్టపోతూ ఉన్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం మొదలైన కారణాల చేత రైతులు ఆనాడు పంట విరామ ప్రకటన చేశారు. దానికి స్పందించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులతో చర్చలు జరిపి ప్రత్యేకించి ఈ సమస్యల పరిష్కారానికై మోహన్ కందా అధ్యక్షతన ఒక కమిటీ వేసి చేతులు దులుపుకున్నారు. కమిటీ సిఫారసులు, రైతుల డిమాండ్లు కాలగర్భంలో కలసిపోయాయి. రైతు పరిస్థితిలో ఏ మాత్రం మార్పులేదు. చూసి చూసి విసుగెత్తిన కోనసీమ రైతాంగం ఇప్పుడు ఉద్యమ బాట పట్టారు. కోనసీమలో కొన్ని మండలాలకే పరిమితమైన ఈ ఉద్యమం మిగిలిన మండలాలకు వ్యాప్తి చెందటం ఆరంభం అయ్యింది. ఈ ప్రాంతంలో రబీ సాగుకు అనుకూలత ఉంది. కానీ ఖరీఫ్ పంట విషయంలో రైతాంగం పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కాదు. ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో వర్షాలు ఎక్కువగా ఉండటం వలన ఖరీఫ్ పంట అంతా ముంపునకు గురి అవుతూనే ఉంది. వర్షాలు కారణంగా ఏర్పడిన వరదనీరు పంట భూములలో చేరి పంట పూర్తిగా దెబ్బ తింటోంది. దీనికి కారణం మురుగునీటి డ్రైన్‌లు పూర్తిగా ఆక్రమణలకు గురి కావడం, గుర్రపు డెక్కతో ప్లాస్టిక్ వ్యర్థాలతో డ్రైన్‌లన్నీ పూడుకుని పోవడం. దాదాపు ఈ డ్రైన్‌లు అన్నీ డస్ట్‌బిన్‌ల్లా తయారయ్యాయి.

ఈ స్థితిలో రైతులు కొంతకాలంగా తరచూ నష్టపోతూనే ఉన్నారు. సేద్యానికి సాగునీరు సక్రమంగా అందించడం ఎంత ముఖ్యమో మురుగు నీరు బయటకు పంపడం కూడా అంతే ముఖ్యం. ఇది ప్రభుత్వ బాధ్యత. ఎందుకంటే వర్షాకాలం సమయంలో మురుగు నీరు పారుదలలో సక్రమ నిర్వహణ లేకపోతే పండిన పంట అంతా ముంపు పాలవుతుంది. రిజర్వాయర్‌లో నీటి నిల్వలు లేకపోతే సాగునీరు సరిపడినంత అందించలేరు. అదే మురుగు నీరు సక్రమంగా బయటకు పంపడం అనేది అసాధ్యం అయిన విషయం కాదు. సాగునీరు నిర్వహణ ఇరిగేషన్ శాఖ బాధ్యత. కోనసీమలో మురుగు నీరు సమస్య ఏళ్ళ తరబడి పరిష్కారం కాలేదు. దీనికి ప్రధాన కారణం ఆక్రమణలు. పంట కాలువ మురుగు కాలువలను ఆక్రమించి కొబ్బరి తోటలు వేయడం, పక్కా భవనాలు నిర్మించినప్పటికీ అధికారులు మౌనంగా చూస్తూ ఉండటం తప్ప ఏమీ చేయలేని స్థితి. దీనితో పాటు సాగునీటి మురుగునీటి కాలువలలోకి మున్సిపాలిటీ పంచాయతీల డ్రైనేజి వ్యవస్థను కలపడం. స్థానిక ప్రభుత్వాలు ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి తప్ప పంట పొలాల మురుగు కాలువలలోకి వీటిని పంపకూడదు అని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా అమలులో వాటిని ఏ స్థానిక ప్రభుత్వం కూడా ఆచరించిన దాఖలాలు కనిపించడం లేదు. దీనివలన అనేక గృహ వ్యర్థాలు. ప్లాస్టిక్ వ్యర్థాలు ఈ పంట మురుగు కాలువలోకి చేరి పూడిక పెరిగిపోయి రైతులకు తీరని వ్యధలను మిగులుస్తోంది.

జీ.ఓ. నంబర్ 188 ప్రకారం పంట, మురుగు కాలువలపై ఆక్రమణలు లేకుండా చూడవలసిన బాధ్యత ఉమ్మడిగా నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖపై ఉంది. చాలా సందర్భాల్లో న్యాయస్థానం ఈ జీ.ఓను పటిష్టంగా అమలు చేయమని ఆదేశాలు ఇచ్చినా అవి అమలు చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ఆక్రమణల్లో ఉన్నవాళ్లు అధికార ప్రతిపక్షాలకు చెందిన వర్గాల రాజకీయ ఒత్తిడుల నడుమ నీటి పారుదల శాఖ, రెవెన్యూ శాఖ నిస్సహాయ స్థితిలో ఉండి పోయాయి. కాలువల సక్రమ నిర్వహణకు రైతుల నుండి నీటి తీరువా వసూలు చేస్తుంది. అయితే ఈ మొత్తాన్ని తిరిగి కాలువల నిర్వహణకై ఎప్పటికప్పుడు ఖర్చు చేస్తూ ఉండాలి. రెవెన్యూ వారి అధీనంలో ఉండే ఈ నిధి నుండి చేసే ఖర్చులలో ఏ మాత్రం పారదర్శకత లేదని రైతులు వాపోతున్నారు. మేము చెల్లించే సొమ్ము మా సాగు అవసరాల కోసం కూడా ఖర్చు చేయడంలో ఎందుకు అలక్ష్యం అని రైతులు ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా కాలువల పూడికతీత పనులు వేసవి కాలంలో చేపడతారు. ఆ సమయంలో కాలువలో నీరు ఉండదు కనుక పనులు సక్రమంగా జరుగుతాయి. అయితే ఏవైనా చిన్నాచితక పనులు ఆరంభిస్తే మాత్రం కాలువలకు నీరు వదిలే సమయంలో మొదలుపెట్టి మమ అనిపించడం ఆనవాయితీ అయిపోయింది. బిల్లులు మంజూరు అయిపోతాయి. పనుల పరిశీలనకు అవకాశం ఉండదు. ఇది కేవలం ఉద్దేశపూర్వకంగా జరిగే తంతుగా రైతులు విమర్శిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముంపు విషయం పక్కన పెట్టి రైతుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకునే కాలువలు ఎప్పుడూ లేని విధంగా జూన్ 1 వ తేదీనే సాగుకు అనుకూలంగా ఏర్పాటు చేసాం అని చెబుతోంది. సాగునీరు రావడం ఎంత ముఖ్యమో మురుగునీరు పోవడం కూడా అంతే ముఖ్యం అనే విషయాన్ని మాత్రం ప్రభుత్వ పెద్దలు గుర్తించకపోవడం శోచనీయం. పైగా వ్యవసాయ అధికారులు హడావిడిగా సమావేశాలు ఏర్పాటు చేసి పంట విరామం ప్రకటించడం వలన భూమిలో లవణీకరణ చేరి భూములు చవుడు బారిపోతాయని దీని ప్రభావం భవిష్యత్‌లో పంట దిగుబడిపై తీవ్రంగా ఉంటుందని హెచ్చరికలు జారీ చేస్తున్నారు కానీ సమస్య పరిష్కారం దిశగా చిత్తశుద్ధి కనపరచడం లేదు అనేది మాత్రం సుస్పష్టం.

వ్యాస రచయిత లెక్చరర్, 9441239578.

జులై నుంచి లేబర్‌కోడ్‌ల అమలు

డా. జ్ఞాన్ పాఠక్

వచ్చే నెల (జులై) నుంచి వివాదస్పదమైన నాలుగు కార్మిక కోడ్‌లను అమలు చేయడానికి బిజెపి ప్రభుత్వం సిద్ధపడుతోంది. దేశంలోని నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ప్రధాని నరేంద్రమోదీ చెప్తూనే ఉన్నారు. ఎనిమిదేళ్లుగా జాతీయ ఉద్యోగ విధానాన్ని రూపొందించేందుకు బహుశా ఆయన తలమునకలై ఉన్నారేమో! లేబర్ కోడ్‌లలో ఒకటి 2019లో, మరో మూడు 2020లో పార్లమెంటు ఆమోదించింది. 2020లో కరోనా విజృంభణ మూలంగా కోట్లాది మంది ఉద్యోగులు నిరుద్యోగులయ్యారు. పది కేంద్ర ట్రేడ్ యూనియన్ల ఫ్రంట్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెలు చేసి, కార్మికులు తమ నిరసన వ్యక్తం చేసినప్పటికీ మోదీ ప్రభుత్వం ఏ మాత్రం వెనుకడుగు వేయటం లేదు. కార్మికులకు సంబంధించిన సమాచారం వివరాలను సమర్పించవలసిందిగా అంతర్జాతీయ కార్మిక సంస్థ ఐఎల్‌ఒ కోరుతున్నప్పటికీ ఈ ప్రభుత్వం మౌనంగానే ఉంటున్నది. మే 27 నుంచి జూన్ 11 వ తేదీ వరకు 110 వ అంతర్జాతీయ కార్మిక సదస్సు జరిగింది. ఈ సదస్సులో భారత ప్రభుత్వ నిష్క్రియాపరత్వాన్ని ఇంకా అనేక అంశాలలో స్పందించకపోవటాన్ని తీవ్రంగా విమర్శించారు. ఐఎల్‌ఒ డైరెక్టర్ జనరల్ గుయ్‌రైడర్ సదస్సులో ప్రసంగిస్తూ భారతదేశంలో ప్రజలు ఎలా జీవిస్తున్నారు, వాళ్ల జీవన భృతి, స్వేచ్ఛ దిగజారిపోయిన పరిస్థితి ఉందన్న సమాచారం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని అన్నారు.

ప్రమాణాల వర్తింపు కమిటీ ఈ సదస్సులో కోవిడ్ మహమ్మారి భారత దేశ ప్రజల ఆరోగ్యం, జీవనం, జీవన భృతిపైన చర్చించి వినాశకరమైన ప్రభావం చూపిందన్న అభిప్రాయం వ్యక్తం చేసింది. ఉద్యోగ అవకాశాలు, శాంతి, తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొల్పడం లాంటి వాటిపైన ప్రభుత్వం శ్రద్ధ వహించాలని 2017లోనే ఈ కమిటీ సిఫారసు చేసింది. భారత సమాజంలో సామాజిక, ఆర్థిక ప్రభావాలు చాలా లోతుగా ఉన్నాయని ఫలితంగా సంక్షోభ పరిస్థితులు ఏర్పడ్డాయని కమిటీ పేర్కొన్నది. ఆ తర్వాత వీటిపై ప్రభుత్వ స్పందన పట్ల కమిటీ సంతృప్తి వ్యక్తం చేసింది. అయితే 110 వ సదస్సు నాటికి పూర్తి సమాచారాన్ని అందించవలసిందిగా భారత ప్రభుత్వాన్ని కోరినప్పటికీ ఫలితం లేదు. ఉద్యోగ కల్పనా విధానాలు, అమలు చేసిన కార్యక్రమాలను తెలియజేయాలని ఐఎల్‌ఒ కోరింది. ఎంప్లాయిమెంట్ పాలసీ కన్వెన్షన్ 1964ను భారత ప్రభుత్వం 1998లో ఆమోదించింది. కోవిడ్ మహమ్మారి కాలంలోను ఆ తర్వాత కార్మిక మార్కెట్, గణాంకాల సమాచారం, కార్మికుల వయసు, స్త్రీ, పురుషుల సంఖ్య, వృత్తి రంగం, వివిధ రంగాలలో కార్మికుల సంఖ్య, ఉద్యోగం, నిరుద్యోగం స్థాయిలు, అసంఘటిత రంగ, ఆర్థిక పరిస్థితి తదితర అంశాల సమాచారాన్ని ఐఎల్‌ఒ కోరినప్పటికీ ప్రభుత్వం అందజేయలేదు.

గతంలోను జాతీయ ఉద్యోగ విధానం (ఎన్‌ఇపి) తదితర అంశాలపై కమిటీ సమాచారాన్ని కోరినప్పటికీ అందించలేదు. 2013లో ఎన్‌ఇపి ముసాయిదాను రూపొందించటం ప్రభుత్వం ప్రారంభించినట్టు తెలిపింది. ఇంతవరకు పూర్తి కాలేదు. ఇంకా ఇందుకు సంబంధించిన వారితో చర్చలు జరుపుతున్నట్లు తెలిపింది. భారత ప్రభుత్వ స్పందన, వాగ్దానాల పైన ఈ కమిటీ సందేహిస్తోంది. ఎందుకంటే ఏడు సంవత్సరాలుగా భారత కార్మిక సదస్సు ఒక్కసారి కూడా జరపలేదు. చివరిగా 2015లో 46 వ సదస్సు నిర్వహించింది. అంతేకాదు భారత ప్రభుత్వం ఏనాడు భారత కార్మిక కాన్ఫరెన్స్ (ఐఎల్‌సి) సలహాను తీసుకోలేదు. 2013లో జరిగిన 45వ సదస్సులో కార్మికులు, యజమానుల సంఘాలతోను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతోను సంప్రదింపులు జరిపి ఉద్యోగ అవకాశాలను అందుకు సిద్ధం చేయవలసిన పరిస్థితులను ఈ కమిటీ సూచించింది. మోదీ ప్రభుత్వం నూతన ఉద్యోగ విధానాన్ని రూపొందించటానికి ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ఉద్యోగ విధాన చర్యల అమలు, పురోగతి తదితర అంశాలకు సంబంధించి అమలు చేస్తున్న కార్యకలాపాల తాజా సమాచారాన్ని తెలియజేయవలసిందిగా ప్రభుత్వాన్ని ఈ కమిటీ కోరింది. 2018-19లో కార్మిక గణాంకాలను గురించి జరిపిన సర్వే నివేదికను పంపారు. అది పాతది. అందువల్ల ప్రస్తుత ఉద్యోగ పరిస్థితి, కార్మికుల పాత్ర, ఉద్యోగం, నిరుద్యోగం అంశాల పైన తాజా నివేదికను పంపవలసిందిగా కమిటీ కోరినప్పటికీ ప్రభుత్వం ఆ పని చేయలేదు.

ప్రపంచ ర్యాంకుల్లో మన వర్సిటీలు 41

క్యూయస్ సంస్థ చొరవతో అకడమిక్ రెప్యుటేషన్, ఎంప్లాయర్ రెప్యుటేషన్, లెక్చరర్లు-విద్యార్థుల నిష్పత్తి, ఫాకల్టీ సైటేషన్, ఇంటర్నేషనల్ ఫాకల్టీ నిష్పత్తి, ఇంటర్నేషనల్ స్టూడెంట్ నిష్పత్తి ఆధారంగా ప్రపంచ యూనివర్సిటీల ర్యాంకులు నిర్ణయించి ప్రకటించారు. 19వ క్యూయస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2023లో 1,418 యూనివర్సిటీలకు చెందిన 51 డిసిప్లైన్స్‌లో జాబితాను తాజాగా విడుదల చేసింది. వెయ్యి అత్యుత్తమ ప్రపంచ యూనివర్సిటీల జాబితాలో 27 యూనివర్సిటీలు మాత్రమే ఇండియాకు చెందినవి ఉన్నాయి. ప్రపంచ అత్యుత్తమ యూనివర్సిటీల జాబితాలో 2021లో 29, 2022లో 35 ఇండియన్ యూనివర్సిటీలు స్థానం దక్కించుకోగా, 2023లో 41 యూనివర్సిటీలు జాబితాలో చోటు పొందడం కొంత ఊరటను కలిగిస్తున్నది. ప్రపంచ అత్యుత్తమ యూనివర్సిటీగా మసాచుసెట్స్ (యంఐటి)-యుయస్ తొలి స్థానంలో నిలువగా 2వ ర్యాంకులో కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ, 3వ ర్యాంకులో స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ, 4వ స్థానంలో ఆక్స్‌ఫర్డ్, 5వ స్థానంలో హార్వర్డ్, 6వ స్థానంలో కాలిఫోర్నియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ/లండన్ ఇంపీరియల్ కాలేజ్, 8వ స్థానంలో యుసియల్-యూకె, 9వ స్థానంలో ఈటిహెచ్ జూరిచ్, 10వ స్థానంలో యూనివర్సిటీ ఆఫ్ చికాగో నిలిచాయి. అత్యుత్తమ ఇండియన్ యూనివర్సిటీల్లో 155వ స్థానంలో ఐఐయస్‌సి-బెంగుళూరు ఉండగా, 172వ స్థానంలో ఐఐటి ముంబాయి, 174వ స్థానంలో ఐఐటి ఢిల్లీ, 250వ స్థానంలో ఐఐటి మద్రాస్, 264వ స్థానంలో ఐఐటి కాన్పూర్, 270వ స్థానంలో ఐఐటి ఖరగ్‌పూర్‌లు 300 లోపు ర్యాంకులను ఆక్రమించాయి. 369వ ర్యాంకులో ఐఐటి రూర్కీ, 384వ ర్యాంకులో ఐఐటి గౌహతి, 396వ ర్యాంకులో ఐఐటి ఇండోర్‌లు ఉన్నాయి. తొలి 500 యూనివర్సిటీల జాబితాలో ఇండియాకు చెందిన వర్సిటీలు 9 మాత్రమే (ఐఐయస్‌సితో పాటు 8 ఐఐటిలు) ఉండడం గమనించాలి. 501-700 మధ్య ర్యాంకుల్లో యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ, సావిత్రిభాయి పూలే పూనే యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్, అన్నా యూనివర్సిటీ, ఐఐటి హైదరాబాద్, జెయన్‌యు-ఢిల్లీ, ఐఐటి బిహెచ్‌యు వారణాసి, ఓ పి జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలు చోటు దక్కించుకున్నాయి. 701-1000 మధ్య ర్యాంకుల్లో ర్యాంకులో జాదవ్‌పూర్ యూనివర్సిటీ, మణిపాల్ అకాడమీ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాదు, ఛండీఘర్ యూనివర్సిటీ, ఐఐటి భువనేశ్వర్, జామియా మిలియన్ ఇస్లామియా-ఢిల్లీ, యన్‌ఐటి తిరుచురాపల్లి, పుదుచ్చేరి యూనివర్సిటీ, శూలిని యూనివర్సిటీ - సోలన్, యూనివర్సిటీ ఆఫ్ కలకత్తా చోటు దక్కించుకున్నాయి. సైటేషన్ ఫర్ ఫాకల్టీ (సిపియఫ్) విశ్లేషణ ప్రకారం అత్యుత్తమ పరిశోధన సంస్థగా 100/100 స్కోర్‌తో ఐఐయస్‌సి-బెంగుళూరు తొలి స్థానంలో నిలువగా 37వ స్థానంలో ఐఐటి గౌహతి, 47వ స్థానంలో ఐఐటి రూర్కీ, 48వ స్థానంలో యూనివర్సిటీ ఆఫ్రికా మద్రాస్‌లు ఉత్తమ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్స్‌గా 50 లోపు ర్యాంకులు పొందాయి. ప్రపంచవ్యాప్తంగా ఎంపిక చేసిన 1,418 అత్యున్నత యూనివర్సిటీల జాబితాలో తెలంగాణకు చెందిన ఐఐటి హైదరాబాదు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాదు, ఉస్మానియా యూనివర్సిటీలు మాత్రమే చోటు దక్కించుకోగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యూనివర్సిటీలు ఒక్కటి కూడా చోటు దక్కించుకోకపోవడం విచారకరం.

ఫ్రాన్స్‌లో వామపక్షాల నూతనోత్తేజం

బుద్దిగ జమిందార్

ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రధాని బోర్న్ మాక్రోన్ పార్టీకి చెందిన మహిళ అనేక ఎన్నికల సమస్యలను తన తోటి 14 మంది మంత్రులతో ఎదుర్కోబోతున్నది. చాలామంది వారివారి నియోజకవర్గాల్లో తిరిగి ఎన్నిక కాలేరని అంచనాలు తెలుపుతున్నాయి. ఇప్పటికే విద్యామంత్రి బ్లాంకెర్ తన పార్లమెంటు నియోజకవర్గంలో నెగ్గటానికి, రెండవ రౌండు ఎన్నికలోకి ప్రవేశించటానికి అవసరమైన మొత్తం ఓటర్లలో 12.5 శాతం సాధించలేక పోయాడు. ఈ కోవలో ఫాసిస్టు భావజాల లీపెన్ పార్టీ మొదటి రౌండ్‌లో 18.68 శాతంతో వామపక్షాల కంటే సుమారు 10 శాతం తక్కువ ఓట్లతో ఉంది. ఆమె పార్టీ నేషనల్ ర్యాలీకి 15 నుండి 30 వరకూ మాత్రమే సీట్లు దక్కే అవకాశాలున్నాయి. మరొక తీవ్ర మితవాది జెమ్మూర్ ఇప్పటికే ఓడి పోయాడు. మాక్రోన్ పార్టీ రానున్న జాతీయ అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీతో బయటపడకపోతే వామపక్షాలను పరిగణలోకి తీసుకుని సంప్రదిస్తూ ముందుకు సాగాల్సి ఉంటుంది. ఏమైనప్పటికీ ఫ్రెంచ్ రాజకీయాల్లో నూతన పునరుజ్జీవాన్ని తీసుకొస్తున్న వామపక్షాలు యూరపు దేశాల మితవాద పరుగులకు అడ్డుకట్ట వేయటానికి నాంది పలుకుతాయనటంలో సందేహం లేదు.



మరో నాలుగు రోజుల్లో (ఈ నెల 19వ తేదీన) జరగనున్న ఫ్రాన్స్ జాతీయ అసెంబ్లీ రెండవ రౌండు ఎన్నికలలో అధ్యక్షుడు మాక్రోన్ మెజారిటీని కోల్పోయే అవకాశాలున్నాయి. వామ పక్ష ఐక్య సంఘటన 'నూప్స్' మొదటి రౌండ్ ఎన్నికల్లో అధికార 'ఎన్సెంబెల్' కూటమితో నువ్వా-నేనా అన్న రీతిగా తలపడగా రెండు కూటములకు 27 శాతం చొప్పున ఓట్లు వచ్చాయి. అధ్యక్షుడి నిర్ణయాలకు ఆమోదముద్ర పడటానికి 577 మంది సభ్యులు గల జాతీయ అసెంబ్లీ డిప్యూటీల దిగువ సభలో 50 శాతం పైన 289 మంది మెజారిటీ సభ్యుల మద్దతు అవసరమవుతుంది. అసెంబ్లీలో పెద్ద పార్టీకి ప్రధానమంత్రి పదవిని ఇస్తారు. ప్రధానమంత్రి స్థానానికి వామపక్ష అభ్యర్థిగా మెలెంచోన్ పోటీలో ఉన్నాడు. మొదటి రౌండ్‌లో మొత్తం ఓటర్ల లిస్టులోని 47.5 శాతం మాత్రమే పాల్గొన్నారు. అధ్యక్షుడు మాక్రోన్ ప్రజా వినాశకర విధానాలకు వ్యతిరేకంగా ఓటర్లు పెద్దఎత్తున తరలివచ్చి వామపక్ష సంఘటనకు ఓట్లు వేయాలని మెలెంచోన్ గట్టిగా ప్రచారం చేస్తున్నాడు.

250 నుండి 295 మధ్య సీట్లని అధికార 'ఎన్సెంబెల్' కూటమి తెచ్చుకొంటుందని, వామపక్షాలకు 200 వరకు మాత్రమే డిప్యూటీలు వస్తాయని జాతీయ సర్వేలు చెబుతున్నప్పటికీ ఈ అంచనాలను తలక్రిందులు చేస్తామని వామపక్షాలు చెబుతున్నాయి. తక్కువ ఓటర్లతో ఎక్కువ గ్రామీణ డిప్యూటీలు ఉన్న నియోజకవర్గాలు తమ కైవసం అవుతాయని అధికార కూటమి చెబుతోంది. వామపక్షాల బలం నగరాల్లో గట్టిగా కనబడుతోంది. ఏప్రిల్ నెలలో జరిగిన ఫ్రాన్స్ అధ్యక్ష ఎన్నికల్లో మెలెంచోన్ మూడవ స్థానంతో సరిపెట్టుకుని, నూతన ఉత్సాహంతో సోషలిస్టులతో - కమ్యూనిస్టులతో - గ్రీన్స్‌తో తన వామపక్ష ఫ్రాన్స్ అన్‌బౌడ్ పార్టీతో కల్సి కూటమిగా ఏర్పడి ఎన్నికల బరిలో ప్రధాని అభ్యర్థిగా దిగాడు.

యువతకు నూతన ఉద్యోగాలు ఇవ్వకుండా గ్లోబలైజేషన్ పేరిట పదవీ విరమణ కాలాన్ని ప్రపంచంలో ప్రభుత్వాలు 60 నుండి 65 సంవత్సరాల వయో పరిమితిని విధిస్తుంటే ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రోన్ కూడా అదే బాటలో నడుస్తానంటున్నాడు. వామపక్ష అభ్యర్థి వయో పరిమితిని 60 సంవత్సరాలకు దాటనీయమంటున్నారు. వంద రకాల నిత్యావసర వస్తువుల ధరలనూ పెరగనీయమని వామపక్షాలు వాగ్దానం చేసాయి. పది లక్షల నూతన ఉద్యోగాలు కల్పిస్తామంటున్నాయి. ఆర్థిక మాంద్యం, 2008 తర్వాత నుండి పెట్టుబడిదారీ వ్యవస్థ ఒకదాని తర్వాత ఒక సంక్షోభంలోకి వెళ్తూనే ఉంది. కార్పోరేట్ల అనుకూల పన్నుల విధానాలతో ప్రజల నెత్తిన పన్నుల భారం పెరగటంతో ఫ్రాన్స్‌లో సుమారు 2 సంవత్సరాల పాటు అవిరళంగా 'పచ్చ జాకెట్ల' ఉద్యమం జరిగింది. టీచర్లు, రైల్వే, బస్సుల సమ్మెలు అనేకసార్లు జరిగాయి. ప్రజా వ్యతిరేక ఉద్దీపన చర్యలు ప్రజల కొనుగోలు శక్తిని క్షీణింపజేశాయి. కోవిడ్-19లో ప్రజా అనుకూల వైద్య నిర్ణయాలు తీసుకోలేక పోవటంతో రికార్డుల్లో మరణాలు జరిగాయి. ఉత్పత్తి కుంటుపడింది. ఉద్యోగాలు ఊడటం, వర్క్ ఫ్రమ్ హోం పేరిట వేతనాల తగ్గింపులు మొదలుగు కార్మిక వ్యతిరేక చర్యల్ని మాక్రోన్ ప్రభుత్వం చేపట్టింది. దీన్ని ఆసరాగా తీసుకొని యూరపు అన్ని దేశాల్లో ఫాసిస్టు పార్టీలు పుంజుకున్నాయి, వామపక్షాల బలాలు జర్మనీ, ఫ్రాన్స్ వంటి అనేక దేశాల్లో బలహీనపడ్డాయి. ఈ తరుణంలో ఫ్రాన్స్ జాతీయ అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్షాలు బలపడటం శుభ పరిణామంగా చూడాలి. క్రమేపీ లాటిన్ అమెరికాలో అనేక దేశాల్లో వామపక్షాలకు ప్రజల మద్దతు, అండ పెరుగుతోంది. అధ్యక్ష ఎన్నికల్లో ఒక సమయంలోనైతే ఏకంగా ఫాసిస్టు లీపెన్ అధ్యక్షురాలిగా ఎన్నిక కావచ్చుననే సంకేతాలు వచ్చాయి. మొదటి రౌండ్‌లో మాక్రోన్ సెంట్రిస్ట్‌కు 27.9 శాతం రాగా, లీపెన్ 23.2 శాతం ఓట్లు సాధించింది. మూడవ స్థానంలో వామపక్ష అభ్యర్థి మెలెంచోన్ 22 శాతం ఓట్లు సాధించగలిగాడు. ఏ వ్యక్తికీ స్పష్టమైన 50 శాతం పై ఓటింగు రాకపోవటంతో మొదటి ఇద్దరు ప్రధాన అభ్యర్థులకు రెండవ రౌండ్ ఎన్నిక జరగగా మాక్రోన్‌కు 58.55 శాతం ఓట్లతో అధ్యక్షునిగా ఎన్నికైనాడు. లీపెన్‌కు 41.45 శాతం ఓట్లు దక్కాయి. వామపక్ష ఓట్లు మాక్రోన్‌కు చేరటం వలనే అధ్యక్షుడైనాడు. ఫాసిస్టు లీపెన్‌ను నివారించిన వామపక్షాలు ఇప్పుడు యూరపులో రెండవ పెద్ద ఆర్థిక వ్యవస్థ గల ఫ్రాన్స్ దేశంలో గట్టి పోటీనివ్వటం నూతన అధ్యాయానికి నాంది పలుకుతుంది. ఫాసిస్టు శక్తుల నివారణకు వామపక్షాలు-ప్రగతిశీల పార్టీలు ఒకే వేదిక పైకి రావాలని ప్రస్తుత ఫ్రాన్స్ ఎన్నికల ట్రెండ్ మనకు తెలియజేస్తోంది.

ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రధాని బోర్న్ మాక్రోన్ పార్టీకి చెందిన మహిళ అనేక ఎన్నికల సమస్యలను తన తోటి 14 మంది మంత్రులతో ఎదుర్కోబోతున్నది. చాలామంది వారివారి నియోజకవర్గాల్లో తిరిగి ఎన్నిక కాలేరని అంచనాలు తెలుపుతున్నాయి. ఇప్పటికే విద్యామంత్రి బ్లాంకెర్ తన పార్లమెంటు నియోజకవర్గంలో నెగ్గటానికి, రెండవ రౌండు ఎన్నికలోకి ప్రవేశించటానికి అవసరమైన మొత్తం ఓటర్లలో 12.5 శాతం సాధించలేక పోయాడు. ఈ కోవలో ఫాసిస్టు భావజాల లీపెన్ పార్టీ మొదటి రౌండ్‌లో 18.68 శాతంతో వామపక్షాల కంటే సుమారు 10 శాతం తక్కువ ఓట్లతో ఉంది. ఆమె పార్టీ నేషనల్ ర్యాలీకి 15 నుండి 30 వరకూ మాత్రమే సీట్లు దక్కే అవకాశాలున్నాయి. మరొక తీవ్ర మితవాది జెమ్మూర్ ఇప్పటికే ఓడి పోయాడు. మాక్రోన్ పార్టీ రానున్న జాతీయ అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీతో బయటపడకపోతే వామపక్షాలను పరిగణలోకి తీసుకుని సంప్రదిస్తూ ముందుకు సాగాల్సి ఉంటుంది. ఏమైనప్పటికీ ఫ్రెంచ్ రాజకీయాల్లో నూతన పునరుజ్జీవాన్ని తీసుకొస్తున్న వామపక్షాలు యూరపు దేశాల మితవాద పరుగులకు అడ్డుకట్ట వేయటానికి నాంది పలుకుతాయనటంలో సందేహం లేదు.

వ్యాస రచయిత ఆల్ ఇండియా ప్రొగ్రెసివ్ ఫోరం నాయకులు, 9849491969

మరింత ప్రమాదంలో మత్స్యకారులు

జెనీవా: కోవిడ్ వాక్సిన్లకు మేధోసంపత్తి హక్కుల రద్దు, మత్స్య కారులకు రాయితీలు, వ్యవసాయం, ఆహార భద్రత వంటి అంశాలపై నిర్ణయం తీసుకునేందుకు ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటీఓ) సమావేశమైంది. రెండేళ్లకోసారి జరిగే ఈ సమావేశాలలో 164 సభ్య దేశాలకు చెందిన వాణిజ్య మంత్రులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు. జెనీవాలోని డబ్ల్యుటిఓ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ప్రారంభమైన డబ్ల్యుటిఓ 12వ మంత్రిత్వ స్థాయి సమావేశాలు నాలుగు రోజుల పాటు జరుగనున్నాయి. ఈ సమావేశాల్లో వాణిజ్య సంఘాల ప్రతినిధులు, సభ్యులు. మత్స్య కార్మికులకు ప్రభుత్వాలు ఇచ్చే సబ్సిడీలు, ఇతర పథకాలకు స్వస్తి పలకాలని భారత్, చైనా వంటి దేశాలపై ధనిక దేశాలు ఒత్తిడి తీసుకొస్తున్నాయి. డబ్ల్యూటీవో ఒప్పందంపై భారత్ సంతకం చేస్తే..ముందు ముందు మత్స్యకార్మికుల పరిస్థితి మరింత ప్రమాదంలో పడనుంది. మత్స్యకార్మికులకు ఆయా దేశాల్లో దక్కుతున్న ప్రభుత్వ సబ్సిడీలతో పోల్చితే భారత్‌లో అందుతున్నది చాలా స్వల్పం. చైనాలో 7.3 బిలియన్ డాలర్లు (సుమారుగా రూ.57వేల కోట్లు), ఈయూ దేశాల్లో 3.8 బిలియన్ డాలర్లు (సుమారుగా రూ.30వేల కోట్లు), అమెరికాలో 3.4 బిలియన్ డాలర్లు (సుమారుగా రూ.26వేల కోట్లు) సబ్సిడీల రూపంలో మత్స్యకార్మికులకు అందుతోంది. వీటితో పోల్చితే భారత్‌లో వివిధ పథకాల ద్వారా సబ్సిడీ రూపంలో అందుతున్నది కేవలం రూ.2144కోట్ల రూపాయలు. దీనికి సంబంధించిన ఒప్పందంపై సభ్య దేశాల మధ్య చర్చలు సాగుతున్నాయి. ప్రభుత్వ సబ్సిడీలను పూర్తిగా ఆపేస్తే..మత్స్యకార్మికుల కుటుంబాలు మరింత పేదరికంలోకి కూరుకుపోతాయి. తీరప్రాంతాల్లో సాంప్రదాయ పద్ధతుల్లో చేపల వేట సాగించేవారే మనదేశంలో ఎక్కువగా ఉన్నారు.

అభివృద్ధి చెందిన దేశాల్లో చేపల వేట భారీ ఎత్తున సాగుతోంది. ఇదొక పరిశ్రమగా ఏర్పడింది. సముద్ర జలాల్లో ఇతర దేశాల ఆర్థిక జోన్లలోకి అభివృద్ధి చెందిన దేశాల ఓడలు చొరబడి చేపల వేటను కొనసాగిస్తున్నాయి. ఇది భారత్‌లోని మత్స్యకార్మికులపై తీవ్ర ప్రభావం చూపనుంది.

ఫ్రాన్స్ ఎన్నికల్లో వామపక్షం విజయం

పారిస్: ఫ్రాన్స్ పార్లమెంటరీ ఎన్నికల్లో కమ్యూనిస్టులు, సోషలిస్టుల వామపక్ష కూటమి మొదటిరౌండ్‌లో విజయం సాధించారు. మొత్తం 577 నేషనల్ అసెంబ్లీ స్థానాలతోపాటు మొదటి రౌండ్ పార్లమెంటరీ ఎన్నికల్లో ఫ్రెంచ్ ఓటర్లు ఆదివారం పోలింగ్‌లో పాల్గొన్నారు. లెఫ్టవింగ్(న్యూప్స్) సంకీర్ణం మాక్రాన్ అధ్యక్ష బృందంతో సమానంగా పోటీకి వచ్చింది. లీపెన్ నేషనల్ ర్యాలీ, రైట్‌వింగ్ రిపబ్లికన్స్ వెనుకంజలో ఉన్నారు.

మాక్రాన్ మళ్లీ అధ్యక్షుడిగా ఎన్నికైనప్పటి నుండి ఏడు వారాల్లో, ఫ్రాన్స్ రాజకీయ దృశ్యం మారిపోయింది. 2017లో కంటే మాక్రాన్ సంకీర్ణం బలహీనంగా ఉంది.

మెలెన్‌చోన్ నేతృత్వంలోని వామపక్ష కూటమి మొదటి రౌండ్ ఓటింగ్‌లో రాజకీయ ప్రకంపనలు నమోదుచేసింది. ఏప్రిల్ అధ్యక్ష ఎన్నికల తరువాత ఏర్పడిన లెఫ్టిస్ట్ న్యూ ఎకోలాజిక్ అండ్ సోషల్ పీపుల్స్ యూనియన్ (న్యూప్స్) కూటమి మాక్రాన్ సంకీర్ణం ఫ్రాన్స్ జాతీయ అసెంబ్లీలో తన మెజారిటీ కోల్పోతుందని స్పష్టం చేసింది. ఓటు వేసేందుకు హాజరుకాని యువకులను, తక్కువ ఆదాయం ఉన్నవారికి ఓటు వేసేందుకు వామపక్షాలు ప్రోత్సహిస్తున్నాయి. లీపెన్‌కు వ్యతిరేకంగా ఏప్రిల్‌లో అధ్యక్షుడిగా ఎన్నికైన మాక్రాన్ సెంట్రిస్టులు, వారి మిత్రపక్షాలు పూర్తి మెజారిటీ సాధించాలంటే వారికి 289 సీట్లు కావాలి. ఫ్రాన్స్ అంతటా 47% మాత్రమే పోలింగ్ నమోదైంది. మాక్రాన్ కూటమి అధ్యక్ష ఎన్నికలలో మొదటి రౌండ్ స్కోర్‌లో 3.9 మిలియన్ ఓట్లను కోల్పోయింది. జూన్ 19న జరిగే తుది ఓటింగ్‌పై భవిష్యత్తు పార్లమెంటు ఆధారపడి ఉంటుంది. ఓటింగ్‌కు అర్హులైన వారిలో 50 శాతం కంటే ఎక్కువ మంది ఓటు వేయకుండా ఉన్నారని, ఇది కొత్త రికార్డుతో కనిష్ట స్థాయికి చేరిందని పోల్స్ సూచిస్తున్నాయి. ముగ్గురు యువ మహిళా అభ్యర్థులతో సహా వామపక్షాల నుంచి నలుగురు పార్లమెంటు సభ్యులు పారిస్ ప్రాంతంలో మొదటి రౌండ్‌లో పూర్తిగా ఎన్నికయ్యారు,

కువైట్‌లో ప్రదర్శనలు నిషేధం

దుబాయ్: దేశంలోని చట్టాలు, నిబంధనలను ఉల్లంఘించినందున నిరసనకారులను వారి వారి దేశాలకు బహిష్కరిస్తామని కువైట్ హెచ్చరించింది. మహ్మద్ ప్రవక్తను కించపరిచేలా బీజేపీ అధికార ప్రతినిధి నూపుర్ శర్మ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన నిర్వాసితులందరినీ అరెస్టు చేసి బహిష్కరించాలని కువైట్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇటువంటి ప్రదర్శనలను కువైట్ చట్టాలు అనుమతించవని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రవాసులు ఇక్కడకు వచ్చి ఇటువంటి ధర్నాలు లేదా ప్రదర్శనలు నిర్వహించరాదని, ఈ దేశ చట్టాలను, నిబంధనలను వారు ఉల్లంఘించినందున నిరసన ప్రదర్శకులను వారి దేశాలకు పంపివేస్తామని కువైట్ ప్రభుత్వం తెలిపింది. మహ్మద్ ప్రవక్తకు మద్దతుగా శుక్రవారం నాటి ప్రార్థనల అనంతరం ప్రదర్శనలు నిర్వహించిన ఫహాహీల్ ఏరియాలోని ప్రవాసులను అరెస్టు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయని సౌదీ అరేబియా నుండి ప్రచురితమయ్యే అరబ్‌న్యూస్ వార్తాపత్రిక పేర్కొంది. వీరిని గుర్తించి, అరెస్టు చేసే క్రమంలో వున్నారని, ఆ తర్వాత వారిని ఆయా దేశాలకు పంపిన తర్వాత మరోసారి వారు కువైట్ రాకుండా నిషేధిస్తారని కువైట్ వార్తాపత్రిక తెలిపింది.కువైట్‌లో భారత రాయబారి సిబి జార్జిని పిలిచి అధికార నిరసన పత్రాన్ని అందజేసినట్లు కువైట్ విదేశాంగ శాఖ తెలిపింది. కువైట్‌లో చట్టబద్ధంగా నివసించే భారతీయుల సంఖ్య పది లక్షలు దాటింది.

మోదీ 'మిషన్ 2024'

(మొదటిపేజీ తరువాయి)

వెలువరించిన వార్షిక నివేదిక ప్రకారం 2020, మార్చి 1 నాటికి కేంద్రప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య 31.91లక్షలుగా ఉంది. వాస్తవానికి ఇది 40.78 లక్షలుగా ఉండాలి అంటే 21.75 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే ఐదు ప్రధాన శాఖలైన రైల్వే, రక్షణ, హోం వ్యవహారాలు, పోస్టులు, రెవెన్యూలో 92శాతం మానవవనరులు ఉన్నట్లు నివేదిక తెలిపింది. కేంద్ర పాలిత ప్రాంతాలు మినహా ఉద్యోగుల సంఖ్య మొత్తం 31.33 లక్షలు కాగా రైల్వేలో 40.55; హోం వ్యవహారాల్లో 30.5; రక్షణ (పౌర) 12.31; పోస్టులు 5.66; రెవెన్యూ 3.26 చొప్పున ఉండగా ఇతర శాఖలు, విభాగాల్లో 7.72 శాతం మంది ఉన్నారు. 2018-19లో రూ.2,08,960.17 కోట్లను ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లింపుల కోసం ఖర్చు చేయగా 2019-20లో ఆ మొత్తం రూ.2,25,744.7 కోట్లుగా ఉంది. కేంద్ర పోలీసు దళాల్లో 10.16లక్షల ఉద్యోగుల భర్తీకి అనుమతి ఉండగా 2020, మార్చి 1 నాటికి 9.05లక్షల ఉద్యోగులు ఉన్నట్లు నివేదిక తెలిపింది. ఈ మేరకు ఉద్యోగాల భర్తీకిగాను వివిధ శాఖల్లో ఉన్న ఖాళీల వివరాలను అందజేయాలని ఆదేశాలు జారీ అయినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

ఇక ఒప్పంద సైనికులు

(మొదటిపేజీ తరువాయి)

డ్యూటీ'గా వ్యవహరించారు. అగ్నిపథ్ పథకాన్ని ప్రారంభించేందుకు దాదాపు రెండేళ్ల పాటు విస్తృత చర్చలు జరిగాయి. ఈ పథకం కింద నియమితులయ్యే సైనికులను 'అగ్నివీర్' అంటారు. ప్రస్తుతం రక్షణ బలగాల్లో షార్ట్ సర్వీస్ కమిషన్ కింద జరుగుతున్న నియామకాలకు పదేళ్ల సర్వీసు ఉంటుంది. దానిని గరిష్టంగా 14ఏళ్ల వరకు పొడిగించవచ్చు. తాజా పథకంలో రక్షణ రంగంపై జీతాలు, పెన్షన్ల భారం గణనీయంగా తగ్గనుంది. దేశంలో రక్షణ రంగ బడ్జెట్ 2022-23లో రూ.5,25,166 లక్షల కోట్లుగా ఉంది. ఇందులో రూ.1.19లక్షల కోట్లను సైనికుల పింఛన్లకు వెచ్చిస్తారు. రెవెన్యూ వ్యయకేటాయింపు రూ.2,33,000 కోట్లు. వేతనాలు, శిబిరాల నిర్వహణ ఖర్చులను కూడుకొని రెవెన్యూ వ్యయం ఉంటుంది.

దేశంలో రెండు న్యాయ వ్యవస్థలు ?

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారు. అక్రమ కట్టడం పేరిట వారి కలల నిలయాన్ని కూల్చివేసి కుటుంబాలను రోడ్డుపాలు చేస్తున్నారు. అదే సమయంలో సంపన్నులు, రాజకీయ ప్రోద్బలం ఉన్న వారి జోలికి వెళ్లడం లేదు. ఇటీవల దిల్లీ జహంగీర్‌పురిలో పేద ముస్లింల ఇళ్లను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. వారంతా మానసికంగా కుంగిపోయేలా చేశారు. తీవ్ర అవేదన కారణంగా వారి ఆరోగ్యం క్షీణించేలా చేశారు. కానీ ఎలాంటి జవాబుదారీతనం లేని అధికారులకు పేదల గోడు వినిపించడం లేదు.. వారి వెతలు కనిపించడం లేదు.. వారి దుస్థితి అర్థం కావడం లేదు. కళ్లుమూసుకొని బుల్డోజర్లు నడిపించేసి హర్షిస్తున్నారు.

ఇదిలావుంటే, జీవనోపాధి కోల్పోయినా.. నిరాశ్రులైనాగానీ పరిహారం ఇచ్చి ఊరుకోవడం పరిష్కారం కాదు. రాజ్యాంగం, చట్టం ప్రకారం అధికారులను బాధ్యులను చేస్తే తప్ప ఈ సమస్యకు పరిష్కారం లభించదు. అక్రమ కట్టడాల యజమానులతో సమానంగా సంబంధిత అధికారులపైనా చర్యలు ఉండాలి. వారి నిర్లక్ష్యానికి శిక్ష పడాలి.. వారు కూడా ఆయా మరణాలకు బాధ్యులే అవుతారు. అధికారులపై చర్యలు లేకుంటే తమను ఎవ్వరు ఏమీ చేయలేరన్న దీమాతో మరింత అలసత్వాన్ని అలవర్చుకుంటారు. అధికారులు జవాబుదారీగా ఉంటే తప్ప ఇటువంటి సమస్యకు పరిష్కారం లభించదు. ఉపహార్ దుర్ఘటన అధికారుల నిర్లక్ష్యానికి, జవాబుదారీతనం లేమికి పరాకాష్ట అంటే ఆరోపణ కాదు. అధికారులకు జావాబుదారీతనం లేకపోవడం దీర్ఘకాలిక దుష్పరిణామాలకు దారితీస్తోంది. సురక్షా పాఠాలు నేర్చుకోవడం లేదు. నేర్చుకున్న కొంత కూడా అనతికాలంలో మరిచిపోయే పరిస్థితి ఉంది. పరిష్కార చర్యలు లేవు. సమయానికి తీసుకునే తగు చర్య ద్వారా విపత్తును నివారించేందుకు ఆస్కారం ఉంటుందన్న విషయం మరువరాదు.

దమనకాండను అడ్డుకోండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తావించారు. ఇదే స్ఫూర్తితో ఈ అంశంలోనూ సుప్రీంకోర్టు సుమోటోగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజ్యాంగ పరిరక్షణకు హామీనిచ్చేలా వ్యవహరించాలని, ఉత్తరప్రదేశ్‌లో క్షీణిస్తున్న శాంతి భద్రతల పరిస్థితిని చక్కబెట్టేలా ఆదేశాలివ్వాలని సీజేఐ రమణకు విన్నవించారు. ప్రజలకు న్యాయ వ్యవస్థపై ఉన్న నమ్మకం వమ్ము కాకుండా సుప్రీంకోర్టు వ్యవహరిస్తుందని ఆకాంక్షించారు. సీజేఐకు లేఖ రాసిన వారిలో సర్వోన్నత న్యాయస్థానం మాజీ జడ్జీలు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, జస్టిస్ వి.గోపాల గౌడ, జస్టిస్ ఏకే గంగూలితో పాటు దిల్లీ హైకోర్టు మాజీ సీజే ఏపీ షా, మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.చంద్రు, కర్ణాటక హైకోర్టు మాజీ జడ్జి మహమ్మద్ అన్వర్, సీనియర్ న్యాయవాదులు శాంతి భూషణ్, ఇందిరా జైసింగ్, సీయూ సింగ్, శ్రీరాం పంచు, ప్రశాంత్ భూషణ్, ఆనంద్ గ్రోవర్ ఉన్నారు.

ఏపీ నుంచి హజ్ యాత్రకు 242 మంది పయనం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ నుంచి తొలి విడతగా హజ్ యాత్రకు వెళ్తున్న ప్రయాణికుల విమానం మంగళవారం మధ్యాహ్నం బెంగళూరు విమానాశ్రయం నుంచి బయలుదేరింది. విమానం బయలుదేరకముందు బెంగళూరులోని కర్ణాటక రాష్ట్ర హజ్ హౌజ్ ప్రాంగణంలో ఏపీ హజ్ కమిటీ చైర్మన్ బద్వేల్ షేక్ గౌసల్ ఆజామ్ యాత్రికులను విమానాశ్రయంలోపలికి తీసుకుని వెళ్తున్న 8 ప్రత్యేక బస్సులకు పచ్చజెండా ఊపి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతపురం, చిత్తూరు జిల్లాల నుంచి 248 మంది హజ్ యాత్రికులు వెళ్లాల్సి ఉండగా, సాంకేతిక కారణాలవల్ల ఆరుగురు వెళ్లలేక పోయారు. దీంతో మిగిలిన 242 మంది హజ్ యాత్రికులు సౌదీ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ప్రత్యేక విమానంలో బయలుదేరి వెళ్ళారు. మలిదశలో భాగంగా ఈనెల 27 , 28 , 30 తేదీల్లో హైదరాబాదులోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గుంటూరు, కర్నూలు జిల్లాలతో పాటు మొత్తం 11 జిల్లాలకు చెందిన 377 మంది చొప్పున మొత్తం 914 హజ్ యాత్రికులు బయలుదేరతారని షేక్ గౌసల్ తెలిపారు.

రెండో రోజు.. ఈడీ విచారణకు రాహుల్

- నేడు మళ్లీ విచారణకు రావాలి
- సూర్జేవాలా, శ్రీనివాస్ బీవీ అరెస్టు - నిర్బంధంలో వందలాది కార్యకర్తలు
- మనీలాండరింగ్ కల్పితం: బాఘెల్
- విపక్ష నేతలపై రాజకీయ కక్షసాధింపు: కాంగ్రెస్

న్యూదిల్లీ: నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం మరోసారి ఈడీ విచారణకు హాజరయ్యారు. 9 గంటల పాటు సుదీర్ఘంగా రాహుల్‌ను అధికారులు విచారించారు. బుధవారం మళ్లీ విచారణకు రావాలని రాహుల్‌కు సూచించారు. సోమవారం దాదాపు 10 గంటల పాటు ఆయనను ఈడీ విచారించింది. ఈ కేసు తమ నేతలపై రాజకీయ కక్షసాధింపు అని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. రాహుల్ (51) ఉదయం 11.05 గంటలప్పుడు దిల్లీలోని ఏపీజే అబ్దుల్ కలాం రోడ్డులోగల ఈడీ కేంద్ర కార్యాలయానికి తన సోదరి ప్రియాంకతో పాటు చేరుకున్నారు. న్యాయ పరమైన చర్యల అనంతరం 11.30 గంటలప్పుడు ఆయన విచారణ మొదలు అయిందని అధికారులు తెలిపారు. నాలుగు గంటల విచారణ అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు గంట విరామం లభించగా రాహుల్ ఇంటికి వెళ్లి తిరిగి సాయంత్రం 4.30 గంటలకు అధికారుల ఎదుట హాజరయ్యారు. సోమవారంలానే సీఆర్పీఎఫ్ జెడ్‌ప్లస్ భద్రతా సిబ్బంది రాహుల్ వాహనం వెంట ఉన్నారు. దిల్లీ పోలీసులను భారీగా మోహరించారు. ఈడీ కార్యాలయం చుట్టుపక్కల సీఆర్పీసీ సెక్షన్ 144 అమలు చేశారు. ఈడీ కార్యాలయానికి వెళ్లే అన్ని మార్గాలను బారికేడ్లతో మూసివేసి సామాన్యులను అనుమతించలేదు. ఆర్ఏఎఫ్, సీఆర్పీఎఫ్ దళాలను మోహరించారు. ఈ క్రమంలోనే వందలాది మంది కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను 24 అక్బర్ రోడ్డు, సెంట్రల్ దిల్లీ వద్ద భద్రతా సిబ్బంది నిర్బంధించారు.

కాంగ్రెస్ నేత రణదీప్ సూర్జేవాలా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ బీవీలను చుట్టుముట్టి పోలీసు బస్సుల్లోకి ఎక్కించారు. నేషనల్ హెరాల్డ్‌లో మనీలాండరింగ్ జరగలేదని, కేంద్రం చెప్పినట్లు దర్యాప్తు సంస్థలు పని చేస్తున్నాయని కాంగ్రెస్ కేంద్ర కార్యాలయాల్లో రాహుల్, ప్రియాంకలతో భేటీ అనంతరం ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బాఘెల్ అన్నారు. గాంధీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్నారని, కాంగ్రెస్ కార్యాలయానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని ఉత్తరాఖండ్ మాజీ సీఎం హరీశ్ రావత్ తెలిపారు. ఇదిలావుంటే, నేషనల్ హెరాల్డ్ వార్తా పత్రికను ఏజేఎల్ (అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్) అనే సంస్థ ప్రచురించేది. నేషనల్ హెరాల్డ్ మాతృసంస్థగా యంగ్ ఇండియా ఉండగా ఇందులో సోనియా, రాహుల్‌కు దాదాపు 76శాతం వాటా ఉంది. ఈ క్రమంలోనే మనీలాండరింగ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్ గాంధీని ఈడీ విచారిస్తోంది. కోవిడ్ సోకిన కారణంగా సోనియా గాంధీ విచారణకు హాజరు కాలేని విషయం విదితమే.

క్రాప్ హాలిడే పేరుతో రెచ్చగొడుతున్నారు

(మొదటిపేజీ తరువాయి)

భరోసా కేంద్రాలను(ఆర్‌బీకే) పరిశీలించే పరిస్థితి తీసుకొచ్చామన్నారు. ఎక్కడా లంచాలు, వివక్ష లేకుండా నేరుగా అర్హుల జాబితా గ్రామ సచివాలయాల్లోనే పెడుతున్నామని, పారదర్శకంగా లబ్ధిదారులకు మేలు చేస్తున్నామని చెప్పారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.7లక్షల సాయం అందిస్తున్నామన్నారు. ఆత్మహత్య చేసుకున్న వారిలో ప్రభుత్వ సాయం అందని కుటుంబం ఒక్కటైనా ఉందా అని జగన్ ప్రశ్నించారు. కోనసీమలో క్రాప్ హాలిడే పేరుతో రైతులను కొందరు రెచ్చగొడుతున్నారని జగన్ విరుచుకుపడ్డారు. క్రాప్ హాలిడే ఎందుకు పాటిస్తారని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు ఎగ్గొట్టిన ధాన్యం బకాయిలు వైసీపీ ప్రభుత్వం తీర్చినందుకా అని నిలదీశారు. కేంద్రం నిధులు ఇవ్వకపోయినా రైతులకు ధాన్యం సేకరణ డబ్బులు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. కోనసీమ జిల్లాకు అంబేడ్కర్ పేరు పెడితే కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని మండిపడ్డారు. దళిత మంత్రి, బీసీ ఎమ్మెల్యే ఇళ్లను దహనం చేశారని ఆగ్రహం వెలిబుచ్చారు. సామాజిక న్యాయం చేస్తుంటే వారికి నచ్చడం లేదని పరోక్షంగా ప్రతిపక్షాలను ఉద్దేశించి అన్నారు. 79శాతం మంత్రి పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఇచ్చామన్నారు. సామాజిక న్యాయానికి తాము నిజమైన అర్థం చెబుతున్నామన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5లను ఏకిపారేశారు. చంద్రబాబు తానా అంటే దత్తపుత్రుడు తందానా అంటున్నారని ఆరోపించారు. ఇక పచ్చ మీడియా ఉన్నదీ లేనిదీ ప్రచారం చేస్తూ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వం చేసే మంచిని ఆ మీడియా చూడలేకపోతోందని వ్యాఖ్యానించారు. పదో తరగతి ఫలితాలను ప్రస్తావిస్తూ పరీక్షలు లేకుండా పాస్‌చేసుకుంటూ రెండేళ్లు వచ్చాం. 67శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. గుజరాత్‌లో 65శాతం మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. రెండేళ్ల తర్వాత పరీక్షలు రాసిన పిల్లలకు ఆత్మస్థైర్యం కల్పించే మాటలు చెప్పాలి. సప్లిమెంటరీ తీసేసి.. రెగ్యులర్‌గానే వారిని భావిస్తూ మళ్లీ పరీక్షలు పెడుతున్నాం. ఆ పిల్లలను సైతం రెచ్చగొట్టడానికి, చెడగొట్టడానికి ప్రయత్నిస్తున్నారు. మన పిల్లలకు ఇవ్వాల్సింది నాణ్యమైన చదువులు. ప్రపంచంతో పోటీపడేటప్పుడు వారి చదువుల్లో నాణ్యత ఉండాలి. విద్యారంగంలో తీసుకువస్తున్న మార్పులను తట్టుకోలేక దాన్ని కూడా రాజకీయం చేస్తున్నారని విమర్శించారు.

కరువు కటకాలతో అల్లాడిపోయే ప్రాంతానికి సాగు, తాగునీరు అందిస్తున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటామని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గ్రామ స్వరాజ్యం, సామాజిక న్యాయం, సంక్షేమం, అభివృద్ధిలో జగన్ పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. తమ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన పేరూరు డ్యామ్‌కు హంద్రీనీవా నీరు అందించిన అపర భగీరథుడు జగన్ అని కొనియాడారు. చిత్రావతి వరదల్లో చిక్కుకున్న పది మందిని కాపాడేందుకు సీఎం చూపిన తెగువ, సాహసం మరువలేనిదన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో పేరూరు డ్యామ్‌కు నీరు ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ రూ.800 కోట్ల దుర్వినియోగానికి పాల్పడ్డారని, అందులో నుంచి లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు మూడు రిజర్వాయర్లు మంజూరు చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. వైయస్‌ఆర్ జలకళ ద్వారా రైతులకు సాగునీరు అందించే కార్యక్రమం చేశారన్నారు. నిరుపేదలకు 15 వేల ఇళ్లు ఇచ్చారని, జగనన్న కాలనీల్లో ఆలమూరులో చెన్నై సిల్క్స్ సంస్థ 7 వేల మందికి ఉపాధి కల్పిస్తామని ముందుకువచ్చిందని, దానికి అనుమతులు ఇచ్చి...నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించాలని కోరారు.

చేనేత రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయాన్ని

ధర్మవరానికి తరలించాలి

ఏపీ చేనేత కార్మిక సంఘం డిమాండు



వినతి పత్రం అందజేస్తున్న జింకా చలపతి, నాగేశ్వరరావు, మోహన్‌రావు, వెంకటేశ్వరరావు, ఈశ్వరరావు

విశాలాంధ్ర-మంగళగిరి: తిరుపతిలోని చేనేత, జౌళి రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయాన్ని సత్యసాయి జిల్లాలోని ధర్మవరం పట్టణానికి తరలించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకా చలపతి, ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు డిమాండు చేశారు. ఈ మేరకు మంగళగిరిలోని చేనేత, జౌళి కమిషనర్ కార్యాలయం అడిషనల్ డైరెక్టర్ శ్రీకాంత్ ప్రభాకర్‌కి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జింకా చలపతి మాట్లాడుతూ సత్యసాయి జిల్లాతో పాటు అన్నమయ్య, అనంతపురం జిల్లాల్లో చేనేత మగ్గాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. ఈ మూడు జిల్లాలలో దాదాపు 30 వేలకుపైగా కుటుంబాలు చేనేతపై జీవనం సాగిస్తున్న క్రమంలో తిరుపతిలోని రీజినల్ కార్యాలయాన్ని సత్యసాయి జిల్లాకు తరలించాలని కోరినట్టు తెలిపారు. పర్యవేక్షణ లేక చేనేతల కోసం చేసిన చట్టాలు సక్రమంగా అమలు కావడం లేదని ఆరోపించారు. తిరుపతిలోని రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయాన్ని సత్యసాయి జిల్లాలోని ధర్మవరానికి మార్చి మరమగ్గాలపై నిరంతర తనిఖీలు చేపట్టాలని కోరారు. మరమగ్గాలతో చేనేతలు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఆత్మహత్యలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి బత్తూరి మోహనరావు, ఉపాధ్యక్షులు గోలి వెంకటేశ్వరరావు, దొడ్డి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఆగస్టుకి రీసర్వే పూర్తి చేయాలి

ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు అజయ్ కల్లం ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకం కింద నిర్వహించే రీ సర్వే కార్యక్రమాన్ని ఎట్టిపరిస్థితుల్లో వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు అజయ్ కల్లం ఆదేశించారు. . క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్క అధికారి సమర్ధవంతంగా పనిచేసినప్పుడే ఈ లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. ప్రభుత్వ ప్రాధన్యతాంశాలలో కీలకమైన భూసర్వే ప్రాజెక్టుపై సచివాలయంలో మంగళవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కాకినాడ, కోనసీమ, ఏలూరు, తిరుపతి జిల్లాల అధికారులతో ఈ సమావేశం నిర్వహించారు. అయా జిల్లాలకు సంబంధించిన సంయుక్త కలెక్టర్లు, ఆర్డిఓలు, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, ఉప సంచాలకులు, మెబైల్ మేజిస్ట్రేట్స్ , తాహసీల్దార్ లు, సర్వేయర్లు, విఆర్ఓలు ఈ సమావేశానికి హజరుకాగా, తమ జిల్లాలలో పరిధిలో జరుగుతున్న సర్వే పనులు సమగ్ర నివేదికలను సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. రీ సర్వే వెయ్యికి పైగా గ్రామాల్లో దాదాపు పూర్తి అయిందని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, భూపరిపాలనా శాఖ ప్రధాన కమీషనర్ సాయిప్రసాద్ తెలిపారు. తొలుత 51 గ్రామాల్లో తదుపరి 572 గ్రామాల్లో రీ సర్వే పూర్తికాగా, ఆగ్రామాల్లో పాత రికార్డుల స్థానంలో ట్యాంపరింగ్‌కు అవకాశం లేని కొత్త భూమి రికార్డులు అందుబాటులోకి వచ్చాయన్నారు. రైతుల అభ్యంతరాలను పరిష్కరించి సరిహద్దులు నిర్ణయించామన్నారు. సర్వే సెటిల్ మెంట్ కమీషనర్ సిద్దార్ధ జైన్ మాట్లాడుతూ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో డిజిటలైజ్డ్ రెవెన్యూ రికార్డులు రూపొందగా, ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్ స్థానంలో భూ కమతాల మ్యాప్, ఆర్ఎస్ఆర్ స్థానంలో రీసర్వే ల్యాండ్ రిజిస్టర్ తీసుకువచ్చామన్నారు. నూతనంగా 1బి రిజిస్టర్, అడంగల్ రిజిస్టర్, రెవెన్యూ గ్రామ మ్యాప్‌లు రూపొందాయన్నారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు శ్యామ్యూల్ , భూపరిపాలనా శాఖ ప్రధాన కమిషనరేట్ కార్యదర్శి అహ్మద్ బాబు, సంయుక్త సంచాలకులు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రపతి ఎన్నికల నామినేషన్లు

న్యూదిల్లీ: రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమవుతుంది. ఇందుకోసం రాజ్యసభ సెక్రటరియేట్ ఓ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. జులై 18న జరిగే రాష్ట్రపతి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోడీని నియమించారు. ఈ విభాగానికి మోడీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కేంద్ర ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం ఏర్పాటు చేసిన ఈ విభాగం(సెల్)లో రాజ్యసభ సెక్రటరియేట్‌లో పనిచేసే దాదాపు అందరు అధికారులు ఉంటారు. ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ముకుల్ పాండే, రాజ్యసభ సెక్రటరియేట్ జాయింట్ సెక్రటరి సురేంద్రకుమార్ త్రిపాఠి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు. వారు కూడా ఈ సెల్‌లో భాగస్వాములుగా ఉంటారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేలా ఈ విభాగం పనిచేస్తుంది. నామినేషన్ పత్రాలు పార్లమెంట్ హౌస్‌లో లభ్యమవుతాయి. రాష్ట్రపతి ఎన్నిక దేశవ్యాప్తంగా జరుగుతుంది. కానీ ఓట్ల లెక్కింపు మాత్రం పార్లమెంటులోనే ఉంటుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో రాజ్యసభ, లోక్‌సభ సెక్రటరియేట్‌ల అధికారులు పాల్గొంటారు. ఈ అధికారులకు ఎన్నికల కమిషన్ శిక్షణ ఇస్తుంది.

నేడు విపక్షాల భేటీ

(మొదటిపేజీ తరువాయి)

తరపున కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, జైరామ్ రమేశ్, రణదీప్ సూర్జేవాలా హాజరవుతారు. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిపై ఏకాభిప్రాయం సాధించడం కోసం మమత ఈ సమావేశం ఏర్పాటు చేశారు. దిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశం జరుగుతుంది. విపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా ఎన్‌సీపీ అధినేత శరద్‌పవార్‌ను బరిలో దించాలని అత్యధిక పార్టీలు భావిస్తున్నాయి. అందులో భాగంగా మమతా బెనర్జీ, వామపక్ష పార్టీల నేతలు మంగళవారం శరద్‌పవార్‌తో వేర్వేరుగా భేటీ అయ్యారు. ఉమ్మడి అభ్యర్థిగా ఉండాలని విన్నవించారు. అయితే రాష్ట్రపతి ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని శరద్ పవార్ స్పష్టంచేసినట్లు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. శరద్ పవార్‌ను ఏచూరి, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా కలిశారు. ఏచూరి పోటీ చేయడం లేదని ఎన్‌సీపీ నేతలు ప్రఫుల్ పటేల్, పీసీ చాకో ధృవీకరించారు. రాష్ట్రపతి పదవి కోసం పవార్ పోటీ చేయడం లేదని, ఇతర పేర్లు పరిశీలనలో ఉన్నాయని ఏచూరి తెలిపారు. తన రాజకీయ చరమాంకంలో రాష్ట్రపతి పదవికి పోటీ చేసి ఓటమి చెందడం పవార్‌కు ఇష్టం లేదని విపక్ష వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు, మమతా బెనర్జీ ఏర్పాటు చేసిన విపక్షాల సమావేశానికి తమ ఎంపీలను పంపుతున్నట్లు సీపీఐ, సీపీఎం ప్రకటించాయి. ఈ సమావేశానికి పార్టీ అగ్రనేతలు హాజరు కావడం లేదని ఏచూరి, డి.రాజా తెలిపారు. సీపీఎం తరపున రాజ్యసభ సభ్యుడు ఎలమరం కరీమ్ సమావేశానికి హాజరవుతారు. విపక్షాల సమావేశం ఏర్పాటుపై మమతా బెనర్జీ ఏకపక్ష నిర్ణయంపై సీపీఐ, సీపీఎం నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు.

చేతి వృత్తిదారుల కార్పొరేషన్లకు నిధులు ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమాఖ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చేతి వృత్తి దారుల కార్పొరేషన్‌లకు తక్షణమే నిధులు కేటాయించి, వారిని ఆర్థికంగా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేతి వృతిదారుల సమాఖ్య ప్రభుత్వాన్ని డిమాండు చేసింది. ఈ మేరకు సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 13వ తేదీన విజయవాడలోని దాసరిభవన్‌లో చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు జింకా చలపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. ఒకసారి అవకాశమిస్తే రాజన్న సంక్షేమ రాజ్యాన్ని స్థాపిస్తానంటూ జగన్ చాలా వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి మూడేళ్లవుతున్నా చేతి వృతిదారులకు ఒరిగిందేమీ లేదన్నారు. ఆర్భాటంగా వృత్తుల వారీగా, కులాల వారీగా ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు ఒక్క పైసా నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. వృత్తుల కార్పొరేషన్ చైర్మన్లు, పాలకవర్గ సభ్యులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారని విమర్శించారు. ఇప్పటికైనా ఆయా కార్పొరేషన్లకు నిధులు కేటాయించి, చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన చేతి వృత్తి దారులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి, చేతి వృత్తిదారులను ఆర్థికంగా ఆదుకుని, వారికి వృత్తిపరమైన రక్షణ కల్పించాలని కోరారు. జూలై 4వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కార్పొరేషన్ కార్యాలయాల ఎదుట చేతి వృతిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నాలతో నిరసన తెలియజేస్తామని, ప్రభుత్వంపై వత్తిడి తీసుకు రావాలని సమావేశం పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. సాంప్రదాయంగా చేపలు పట్టుకుని జీవిస్తున్న మత్స్యకారుల జీవనాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వం విడుదల చేసిన 214 జీవోను వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు, నదీ తీర ప్రాంతాల్లో చేపల వేటతో జీవిస్తున్న మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసేందుకు నెల్లూరు జిల్లాల్లో అమలు చేస్తున్న పైలట్ ప్రాజెక్టు వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆ జీవోను రద్దు చేయాలని డిమాండు చేశారు. సమావేశానికి ముందుగా ఇటీవల మరణించిన చేతి వృతిదారుల సమాఖ్య శ్రీకాకుళం జిల్లా నాయకురాలు చీకటి ఎర్రమ్మ, రాష్ట్ర వర్కింగ్ ఉమెన్స్ యూనియన్ నాయకురాలు కె.వసుమతి, ఆత్మహత్య చేసుకొని మరణించిన చేనేత కార్మికులకు సంతాపం తెలిపినట్టు పేర్కొన్నారు

‘మనసున్నోడు’ను ప్రజలు ఆదరించాలి

- సమాజ మంచికి చిత్ర సందేశం దోహదం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- మనసున్నోడు చిత్రం ట్రైలర్ పాటల ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: మానవీయ జర్నలిజం, వాస్తవం ఆధారంగా తెరకెక్కిన మనస్సునోడు చిత్రాన్ని ప్రజలు ఆదరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆకాంక్షించారు. విశ్వ జాగృతి మూవీస్ పతాకంపై నిర్మించిన ‘మనసున్నోడు’ చిత్రం ట్రైలర్ పాటలను విజయవాడలోని దాసరిభవన్‌లో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రస్తుతం ఒక చిత్రం తెరకెక్కించాలంటే ఎంతో కష్టతరమైన పని అని, కోట్లాది రూపాయల ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. అలాంటి తరుణంలో నిజ జీవితంలో జరిగిన ఒక సంఘటనను ఆధారంగా చేసుకుని, ఒక మనసున్న మనిషి టైటిల్‌తో, వాస్తవ ఇతి వృత్తంతో సమాజానికి తెలియజేయాలన్న సదుద్దేశంతో చిత్రాన్ని నిర్మించారన్నారు. ఇది చాలా కష్టంతో కూడుకున్నదని, సమాజంలో మంచిని పెంచేందుకు ఈ చిత్రం సందేశం దోహదపడుతుందని చెప్పారు. దీనిని ప్రజలు ఆదరించాల్సిన అవసరముందని, చిత్రం విడుదలకు సినిమా నిర్మాతల మండలి సహకరించాలని కోరారు. సమాజంలో పెరిగిపోతున్న ఆగడాలను, దురహంకారాలను అరికట్టేందుకుగాను జైభీమ్, మనసున్నోడు తరహా చిత్రాలు మరిన్ని తీయాల్సిన సూచించారు. దర్శకుడు వేల్పుల నాగేశ్వరరావు మాట్లాడుతూ, వాస్తవ కథా మూలాంశంగా ఈ చిత్రాన్ని ఎంతో మానవీయ కోణంలో రూపొందించామన్నారు. చిత్రం ట్రైలర్స్‌ను ఆయన ప్రదర్శింపజేసి, అందులోని పాత్రల అంశాలను తెలిపారు. ఈ చిత్ర కథనానికి మూలంగా నిలిచిన వాస్తవ వ్యక్తులైన పల్లి వెంకటేశ్వర్లు, అముద, రమణలను దర్శకుడు పరిచయం చేశారు. లాభాపేక్ష లేకుండా, కేవలం మానవీయ కోణంలో తెరక్కించిన ఈ చిత్రం విడుదలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్షులు పి.చంద్రానాయక్ మాట్లాడుతూ, సమాజంలో దిగజారిపోతున్న మానవీయ విలువలు పెంపొందించడానికి ఈ తరహా చిత్రాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖరరావు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి సిహెచ్.పెంచలయ్య, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్ పఠాన్, చిత్ర నిర్మాత వి.బలరామ్ నాయకర్, నటీనటులు డి.ఉమాశంకర్, రేవతి, కృష్ణంరాజు, ఎం.హరిచందన, కూర్మారావు, వీటీ రాజు, రాము, డి.ప్రకాశ్, వి.శ్రీనివాస్, బ్రహ్మం, వివిధ ప్రజా సంఘాల నేతలు, కళాకారులు పాల్గొన్నారు.

టోకు ద్రవ్యోల్బణం రికార్డు

- మేలో 15.88 శాతానికి పెరుగుదల
- అధిక ధరలే కారణం
- వరుసగా 14వ నెలలో రెండంకెల స్థాయిలోనే

న్యూఢిల్లీ : దేశంలో ద్రవ్యోల్బణం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఫలితంగా ప్రజల జీవితాన్ని ప్రభావితం చేస్తోంది. ఆహారం, ఇంధనం విద్యుత్ ధరలలో పెరుగుదల కారణంగా టోకు ద్రవ్యోల్బణం రెండంకెల స్థాయిలో కొనసాగుతోంది. తాజాగా రికార్డును నమోదు చేసింది. ఆహార పదార్థాలు, ఇంధన ధరలు తారాస్థాయికి చేరిన పర్యవసానంగా టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) మే నెలలో 15.88 శాతానికి చేరింది. గతేడాది ఏప్రిల్ నుంచి వరుసగా 14నెలల పాటు డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం రెండంకెల పెరుగుదలను నమోదు చేస్తూ వచ్చింది. మూడు నెలలుగా గ్రాఫ్ కిందకు దిగిందే లేదు. గతేడాది మేలో డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం 13.11శాతంగా ఉండగా ఏప్రిల్‌లో 15.08శాతంగా ఉంది. పండ్లు, కూరగాయలు, ఆహారోత్పత్తులు, మినరల్ అయిల్స్, ముడి పెట్రోలియం, సహజ వాయువు, లోహాలు, ఆహారయేతర వస్తువులు, రసాయనాలు, రసాయన ఆధారిత ఉత్పత్తుల ధరలు భారీగా పెరిగిన కారణంగా 2022 మేలో ద్రవ్యోల్బణం రికార్డు స్థాయికి చేరిందని వాణిజ్య, పరిశ్రమల శాఖ తాజా ప్రకటనలో పేర్కొంది. మేలో ఆహారోత్పత్తుల ద్రవ్యోల్బణం 12.34 శాతంగా ఉంది. కూరగాయలు, గోధుమలు, పండ్లు, బంగాళ దుంప ధరల్లో ఏడాదిగా భారీ పెరుగుదల నమోదు అయింది. కూరగాయల ధరలు 56.36శాతం మేర పెరిగితే గోధుమల ధర 10.55శాతం, గుడ్లు, మాంసం, చేపల ధరల్లో 7.78శాతం పెంపు నమోదు అయింది. ఇంధనం, విద్యుత్ ద్రవ్యోల్బణం 40.62 శాతంగా ఉంటే తయారీ వస్తువులు, నూనె గింజల ధరలు 10.11శాతం, 7.08శాతం చొప్పున పెరిగినట్లు ప్రకటన పేర్కొంది. ముడి పెట్రోలియం, సహజ వాయువు ద్రవ్యోల్బణం మేలో 79.50 శాతంగా నమోదు అయింది. మేలో రీటైల్ ద్రవ్యోల్బణం 7.04శాతంగా ఉంది. ఇది ఆర్బీఐ అంచనాల కంటే అధికంగా నమోదు అయింది. వరుసగా ఐదవ నెలలోనూ 7.04 శాతంగా ఉంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు కీలకమైన వడ్డీ రేట్లను 40 బేసిక్ పాయింట్ల మేర మేలో.. 50 బేసిక్ పాయింట్ల లెక్కన జూన్‌లో ఆర్బీఐ పెంచింది. 2022-23 ద్రవ్యోల్బణం అంచనాలను 100 బేసిక్ పాయింట్లు పెంచి 6.7శాతానికి కేంద్ర బ్యాంకు పెంచింది.

నేటినుంచి చంద్రబాబు ప్రచారయాత్ర

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలకు శ్రీకారం చుట్టారు. బుధవారం నుంచి ఎన్టీఆర్ స్ఫూర్తి – చంద్రన్న భరోసా పేరుతో ఏడాది పాటు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించాలని చంద్రబాబు నిర్ణయించారు. ఒక్కో టూర్‌లో చంద్రబాబు మూడు రోజులు జిల్లాలలో పర్యటించనున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను, విధ్వంస పాలనను ఎండగడుతూ...ప్రజల భవిష్యత్‌కు భరోసా ఇచ్చేలా ఈ పర్యటనలు కొనసాగనున్నాయి. ఎన్టీఆర్ శతజయంతిపై ఏడాది పాటు జరిగే ఉత్సవాల నిర్వహణలో భాగంగా అనకాపల్లి జిల్లా చోడవరం నియోజకవర్గంలో తొలి జిల్లా మహానాడు ఈనెల 15న జరుగుతుంది. మొదటి రోజు మహానాడు మహాసభ ఏర్పాటు చేస్తున్నారు. రెండో రోజు పార్లమెంట్‌లోని ఏడు నియోజకవర్గాల నేతలు, ముఖ్య కార్యకర్తలతో చంద్రబాబు ఆత్మీయ సమావేశం జరుగుతుంది. మూడో రోజు ప్రజా సమస్యలు, ప్రభుత్వ బాదుడే బాదుడుపై రోడ్‌షో నిర్వహిస్తారు. ఏడాది పాటు 100కి పైగా నియోజకవర్గాలు చుట్టివచ్చేలా చంద్రబాబు పర్యటనకు రూట్‌మ్యాప్ సిద్ధం చేశారు. నెలకు రెండు టూర్లు ఉండేలా ప్రణాళిక రూపొందించారు.

వైఎఫ్ ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల నూతన కార్యవర్గం

గోవిందరాజులు

పృథ్వీరాజ్

నాగమల్లేశ్వరరావు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. రెండు జిల్లాల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం విజయవాడలోని దాసరి భవన్‌లో జిల్లా అధ్యక్షులు పడమట నరేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఎన్టీఆర్‌జిల్లా అధ్యక్షులుగా లంకా గోవిందరాజులు (జూనియర్), ప్రధాన కార్యదర్శిగా పెయ్యల పృథ్వీరాజ్, ఉపాధ్యక్షులుగా చీకటి సైదారావు, కొమ్మినేని మురళీ, సాయి కుమార్, సహాయ కార్యదర్శులుగా ఎండీ మోహిసుద్దీన్,షేక్. సుభాని ఎన్నికయ్యారు. వీరితో కలిపి 17 మందితో నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఏఐవైఎఫ్ కృష్ణాజిల్లా కన్వీనర్‌గా లంకా నాగమలేశ్వరరావుతోపాటు కార్యవర్గసభ్యులుగా అలవాల చిన్నయ్య, సిద్దాబత్తుల. శ్రీనివాస్, గగన్, అవినాశ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు మాట్లాడుతూ, జాబ్ క్యాలెండర్ ప్రకటించి సంవత్సర కాలం గడుస్తున్నా ఉద్యోగాల భర్తీ చేయకపోవడం సిగ్గుచేటన్నారు. మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు అక్కినేని వనజ, మాజీ నాయకులు దోనేపుడి శంకర్, జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగాల కోసం 17న ధర్నాలు

ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ పోరాట సమితి పిలుపు

మాట్లాడుతున్న లెనిన్‌బాబు. పక్కన రాజేంద్ర, రాజశేఖర్, ఓబులేశు తదితరులు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ప్రభుత్వ ఉద్యోగాల ప్రకటనల కోసం ఈనెల 17వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ పోరాట సమితి పిలుపునిచ్చింది. విజయవాడ దాసరిభవన్‌లో విద్యార్థి, యువజన, నిరుద్యోగ సంఘాలు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర అధ్యక్షతన మంగళవారం సమావేశమయ్యాయి. ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు గన్ని రాజు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, తెలుగు యువత రాష్ట్ర నాయకుడు నాగూర్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని ఏళ్ల నుంచి ఉద్యమాలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఏడాది అవుతున్నప్పటికీ ఇంతవరకు ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని మండిపడ్డారు. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండరు విడుదల చేస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారని, దీనిని అమలు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. నిరుద్యోగుల ఆందోళనలకు తలొగ్గిన జగన్..గతేడాది జూన్ 18న 10,143 ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ ప్రకటించారని, కానీ ఉద్యోగాల భర్తీని మరిచారని విమర్శించారు. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఈ ఏడాది పది పరీక్ష ఫలితాల్లో తక్కువ శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. తక్షణమే 25 వేలతో మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండు చేశారు. ఏపీపీఎస్సీ ద్వారా సకాలంలో ఉద్యోగ ప్రకటనలు, ఇంటర్వ్యూలు, ఫలితాలిచ్చేలా చూడాలన్నారు. ఈనెల 22న జరిగే మంత్రివర్గ సమావేశంలో నిరుద్యోగ సమస్యపై చర్చించాలని, లేకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుజ్జుల ఓబులేశు, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు గంగా సురేశ్, లంక గోవిందరాజు, పృథ్వీ కుమార్, పీడీఎస్‌యూ విజయవాడ నగర కార్యదర్శి రాజేశ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయం అదుర్స్

- ఒక్క రోజే రూ.18.33 కోట్లు
- ఆదరిస్తున్న ప్రయాణికులు
- పెరిగిన సర్వీసులు
- సిబ్బంది సేవలు సంతృప్తికరం
- ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మానందరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఈ వేసవిలో ఆర్టీసీకి గణనీయంగా ఆదాయం వచ్చిందని, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఆపరేషన్స్) కేఎస్ బ్రహ్మానందరెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆర్టీసీ బస్సులలో ప్రయాణించేవారి సంఖ్య పెరగడంతోపాటు ఆదాయం కూడా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయని తెలిపారు. రెండేళ్లుగా కరోనా మహమ్మారితో వందలాది కోట్ల ఆదాయాన్ని కోల్పోయిన ఆర్టీసీకి ఈ పరిణామాలు ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయని వివరించారు. జనవరిలో సంక్రాంతి సందర్భంగా, 17వ తేదీన ఆర్టీసీకి రూ.15.40కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. ఫిబ్రవరి, మార్చి నెలలలో రోజుకు దాదాపు రూ.15.30కోట్ల ఆదాయం తగ్గకుండా వస్తూనే ఉందని పేర్కొన్నారు. ఈనెల 13వ తేదీన ఒకే రోజు అత్యధికంగా రూ.18.33 కోట్లను ఆర్టీసీ ఆర్జించిందన్నారు. ఆర్టీసీ వాణిజ్యేతర కార్యాకలాపాల ద్వారా ఆదాయాన్ని గడిస్తోందని, రాబడిలో పల్లెవెలుగు, సూపర్ లగ్జరీ, ఏసీ బస్సులు ప్రధాన భూమిక పోషిస్తున్నాయన్నారు. సిబ్బందికి నిత్యం ఆర్టీసీ అధికారులు తగిన సూచనలిస్తూ, ఆదాయం పెరుగుదలకు కృషి చేస్తున్నారన్నారు. ప్రయాణీకులు ప్రైవేటు వాహనాలు, ఆటోలను ఆశ్రయించకుండా ఆర్టీసీని ఆదరించడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. విజయవాడ నుంచి హైదరాబాద్ సర్వీసులు రద్దీగా మారాయన్నారు. జూన్ 9 నుంచి 12 వరకు విజయవాడ–హైదరాబాద్ మార్గంలో ఆదాయం బాగా పెరిగిందని, రోజుకు రూ.4 లక్షల నుంచి రూ.5లక్షల వృద్ధి కన్పిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ ఆర్టీసీ కంటే, ఏపీఎస్ఆర్టీసీ టికెట్ల ధరలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. జులైలో విద్యా సంస్థలు, కళాశాలలు తిరిగి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బస్సుల సంఖ్య పెంపుదల, సమయపాలనలో తగిన చర్యలు తీసుకున్నామన్నారు. ఆర్టీసీ ఆదాయం పెరగడంలో అహర్నిశలు శ్రమిస్తున్న ట్రాఫిక్, గ్యారేజీ సిబ్బందిని అభినందించారు. రానున్న రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తితో సమర్థంగా విధులు నిర్వహించి, ఆర్టీసీ ప్రగతికి కృషి చేయాలని కోరారు.

ఆర్టీసీ ఉద్యోగులకు 1.6% ఫిట్‌మెంట్ ఇవ్వాలి

ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీ చైర్మన్ అశుతోశ్ మిశ్రా నివేదిక ప్రకారం 1.6శాతం ఫిట్‌మెంట్‌ను ఖరారు చేయాలని ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక ప్రభుత్వాన్ని డిమాండు చేసింది. ఆర్టీసీ జేఏసీ కన్వీనర్లు వై.శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు, కో–కన్వీనర్లు సి.హెచ్. సుందరయ్య, వైఎస్‌రావు, రాష్ట్ర అధ్యక్షులు పీవీ రమణారెడ్డి, వైవీరావు మాట్లాడుతూ... వేతనాల పెంపుదలపై జీవోలు, ప్రభుత్వ ఉద్యోగులకు, ఆర్టీసీ ఉద్యోగులకు వేతన భత్యాలలో ఉన్న తేడాలు ఎప్పుడు సరిచేస్తారోనని ఎదురు చూస్తుంటే...అది జరగడం లేదన్నారు. పీఆర్సీ చైర్మన్ మిశ్రా ఇచ్చిన నివేదిక ప్రకారం 1.6శాతం అదనపు ఫిట్‌మెంటుతోపాటు పెండింగ్ డీఏలు ఇవ్వాలన్నారు. గతంలో ఆర్టీసీ ఉద్యోగులకు జరిగిన తాత్కాలిక ఫిట్‌మెంట్ 25 శాతానికిగాను మిశ్రా నివేదిక ప్రకారం 6.3శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాల్సింది పోయి, ప్రస్తుత పీఆర్సీ జీవోలలో కేవలం 3.1శాతం ఫిట్‌మెంట్ ఇచ్చేలా జీవోలు ఇవ్వడం అన్యాయమన్నారు. జరిగిన నష్టాన్ని భర్తీచేసేలా ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రకమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల పాటు గేట్ మీటింగు, నిరసనలు విజయవంతంగా నిర్వహించారు.

చెల్లింపులపై వివరాలేవి?

ఉపాధి పెండింగ్ బిల్లుల కేసులో హైకోర్టు మరోసారి సీరియస్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ఉపాధి బిల్లుల చెల్లింపు కోర్టు ధిక్కార కేసులో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వంపై మరోసారి సీరియస్ అయ్యింది. ఈ కేసులో మంగళవారం కోర్టుకు హాజరైన సీనియర్ ఐఏఎస్ అధికారులు గోపాలకృష్ణ ద్వివేది, ఎస్ఎస్ రావత్, కొన శశిధర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. కర్నూలులో ప్రభుత్వం డబ్బు ఇవ్వకపోవడంతో ఆత్మహత్య చేసుకున్న కాంట్రాక్టర్ వ్యవహారంపై న్యాయమూర్తి బట్టు దేవానంద్ అధికారులను నిలదీశారు. ఆ కుటుంబానికి ఇప్పుడు ఎవరు అండగా నిలుస్తారని నిలదీశారు. ఒకటి, రెండు కేసుల్లో అయితే కోర్టు ధిక్కారం ఉంటుందని, అన్ని ఆదేశాలలో కోర్టు ధిక్కార కేసులు నమోదయితే ఎలా? అని ప్రశ్నించారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు సీఎఫ్ఎంఎస్ ద్వారా జరిగిన చెల్లింపుల స్టేట్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. డబ్బులు అప్పు తీసుకొచ్చి పనులు చేసినప్పుడు వారికి బిల్లులు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు ఇలా అయితే పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేశారు.

కాంగ్రెస్ నిరసనలు – నేతల అరెస్టు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేతలు కేసీ వేణుగోపాల్, అధిర్ రంజన్ చౌదరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి నిషేధాజ్ఞలను అమలు చేయగా వాటికి అతిక్ర మించినట్లు ఆరోపిస్తూ ఇద్దరు నేతలను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ఈడీ విచారణకు వెళ్లే ముందు రాహుల్ పార్టీ సీనియర్లతో కలిసి కేంద్ర కార్యాలయం వద్ద ధర్నాలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులు అశోక్ గెహ్లాట్, భూపేశ్ బాఘేల్ , ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, పార్టీ ఎంపీలు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. రాహుల్ విచారణ నేపథ్యంలో అనేక చోట్ల నిరసనలు తెలిపిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను నిర్బంధించి పోలీసు వాహ నాల్లో ఎక్కించి వేర్వేరు పోలీసు స్టేషన్లకు తరలించారు.

ఇంకెంత కాలం మోసం?

మోదీ 10 లక్షల ఉద్యోగాల ప్రకటనపై కాంగ్రెస్

న్యూఢిల్లీ: రానున్న ఏడాదిన్నర కాలంలో 10 లక్షల ఉద్యోగ నియామకాలు చేపడుతున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించడాన్ని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. ఇంకెంతకాలం ప్రజలను మోసగిస్తారని ప్రశ్నించింది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చారని, ఆ హామీ ప్రకారం గడచిన 8 ఏళ్లలో 16 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందని కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా పేర్కొన్నారు. ‘ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ లెక్కన ఇప్పటికి 16 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలి. ఇప్పుడేమో..2024 నాటికి 10 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెబుతున్నారు. ప్రభుత్వ శాఖల్లో 60 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వంలోనే 30 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ మోసపూరిత మాటలు, ప్రకటనలు, హామీలు ఇంకెంతకాలం కొనసాగిస్తారు?’ అని సూర్జేవాలా ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. దేశంలో నిరుద్యోగం పెరగడం, కొత్త ఉద్యోగ కల్పన లేకపోవడంపై కాంగ్రెస్ చాలాకాలంగా మోదీ సర్కారుపై విమర్శలు గుప్పిస్తోంది. వచ్చే ఏడాదిన్నర కాలంలో యుద్ధప్రాతిపదికన 10 లక్షల నియామకాలు చేపట్టాలని వివిధ ప్రభుత్వ విభాగాలు, మంత్రిత్వశాఖలను ప్రధాని మంగళవారం ఆదేశించారు. అన్ని ప్రభుత్వ విభాగాలు, మంత్రిత్వశాఖల్లో మానవవనరుల పరిస్థితిపై సమీక్షించిన అనంతరం మోదీ ఈ ఆదేశాలు ఇచ్చారు. నిరుద్యోగంపై ప్రతిపక్షం పదేపదే విమర్శలు చేయడాన్ని కూడా ప్రధాని దృష్టిలో పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

ఆగని అక్రమ అరెస్టులు

యూపీలో 337 మంది నిర్బంధం
జమ్మూలో తొమ్మిది మంది

లక్నో / జమ్మూ : ప్రవక్త మహమ్మద్‌పై బీజేపీ నేతల అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళనకు దిగిన ముస్లింల అరెస్టుల పర్వం వరుసగా నాల్గో రోజు కొనసాగింది. ఒక్క యూపీలోనే 337 మంది అరెస్టు కాగా 13 మంది తాజా ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయి. జమ్మూకశ్మీర్‌లో తొమ్మిది మంది అరెస్టు అయ్యారు. జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలోగల భదేవా పట్టణంలో కర్ఫ్యూ విధించారు. కిశ్త్వార్ జిల్లా సమీపంలో ఐదు గంటల పాటు నిషేధాజ్ఞలను సడలించినట్లు అధికారులు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఎనిమిది జిల్లాల్లో 337 మంది అరెస్టు కాగా తొమ్మిది జిల్లాల్లో 13 ఎఫ్ఐఆర్‌లు నమోదు అయినట్లు ఏడీజీపీ ప్రశాంత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరెస్టు అయిన 337 మందిలో 92 మంది ప్రయాగ్‌రాజ్‌కు చెందిన వారు కాగా 83 మంది సహరన్‌పూర్‌కు, 52 మంది హత్రాస్‌కు, 41 మంది అంబేద్కర్ నగర్‌కు, 40 మంది మొరాదాబాద్‌కు, 18 మంది ఫిరోజాబాద్‌కు, ఆరుగురు అలీఘర్‌కు, ఐదుగురు జలౌన్‌కు చెందిన వారన్నారు. 13 కొత్త కేసుల్లో ప్రయాగ్‌రాజ్, సహరన్‌పూర్‌లో మూడు చొప్పున నమోదు కాగా ఫిరోజాబాద్, అంబేద్కర్‌నగర్, మొరాదాబాద్, హత్రాస్, అలీఘర్, లఖింపూర్ ఖేరి, జలౌన్‌లో చెరొకటి నమోదు అయినట్లు తెలిపారు. జమ్మూకశ్మీర్‌లోని భదేవా పట్టణంలో కర్ఫ్యూ విధించగా స్థానికంగా తొమ్మిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అక్కడి అధికారులు తెలిపారు. నిరసన క్రమంలో రెచ్చగొట్టే విధంగా నినాదాలు చేసినందుకు తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మసీదులో విద్వేషపూరిత ప్రసంగం చేసినందుకు ఆదివారం ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలో శాంతిభద్రతలను పోలీసులు, అధికారులు నిశితంగా గమనిస్తున్నట్లు వెల్లడించారు. కిశ్త్వార్‌లో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి ఐదు గంటల పాటు కర్ఫ్యూను సడలించగా దుకాణాలు తెరుచుకున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం కూడా గంటన్నర పాటు ఆంక్షలను సడలించగా ప్రజలు మార్కెట్లకు వెళ్లి నిత్యావసారాలను కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. బ్రాడ్‌బాండ్, మొబైల్ ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించలేదని అధికారులు చెప్పారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.